


రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త


## ఇద్దరు చిన్నారులకు ఉరివేసి..

# తల్లి బలవన్మరణం

**✦బిడ్డలను అనాథలుగా వదిలేయలేక...నాతో తీసుకెళుతున్నా**
**✦ సూసైడ్ నోట్ .... అడవి వెంకటాపూర్‌లో విషాదం**
**✦భర్త వేధింపులే కారణమని మృతురాలి బంధువుల ఫిర్యాదు**

**పరిగి జూన్ 14 ప్రభాతవార్త :** కుటుంబ కలహాలు నిండు సంసారంలో తీవ్ర విషాదాన్ని నింపాయి. భర్త, కుటుంబ సభ్యుల వేధింపులతో మనస్తాపానికి గురైన ఓ తల్లి, తన ఇద్దరు అమాయక పిల్లలను ఉరివేసి చంపి, ఆపై తానూ ఉరివేసుకుని ప్రాణాలు తీసుకుంది. ఈ ఘోర ఘటన చౌడాపూర్ మండల పరిధిలోని అడవి వెంకటాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల



కథనం ప్రకారం... అడవి వెంకటాపూర్ గ్రామానికి చెందిన జంబుల మల్లేష్ భార్య జంబుల నవనీతకు ఒక కుమారుడు విగ్నేష్, కూతురు మధుప్రియ ఉన్నారు. గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. భర్త మల్లేష్, కుటుంబ సభ్యులు నవనీతను తీవ్రంగా వేధిస్తుండేవారన్న ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో శనివారం రాత్రి కుటుంబంలో మళ్లీ కలహాలు రేగడంతో తీవ్ర మనస్థాపానికి లోనైన నవనీత ఘోర నిర్ణయం తీసుకుంది. తాను చనిపోతే తన పిల్లలు అనాథలు అవుతారని భావించిన ఆమె, పిల్లలు అనాథలు కాకూడదనే నాతో పాటు తీసుకెళ్తున్నా.. అని సూసైడ్ నోట్ రాసి పెట్టింది. అనంతరం తన చేతులతోనే కుమారుడు విగ్నేష్, కూతురు మధుప్రియలను ఉరివేసి హతమార్చింది. ఆ తర్వాత తానూ అదే గదిలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు శనివారం రాత్రి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతురాలి పుట్టింటి వారి ఫిర్యాదు మేరకు భర్త, కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు సిఐ కొండల్ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం నిందితుడైన భర్త మల్లేష్ పరారీలో ఉన్నాడని, అతని కోసం గాలిస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు. ఒకే ఇంట్లో తల్లి, ఇద్దరు చిన్నారులు శవాలుగా మారడంతో అడవి వెంకటాపూర్ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## గుట్కా విక్రేతలపై కేసులు నమోదు

**రంగారెడ్డి అర్బన్ జూన్ 14, ప్రభాతవార్త :** నిషేధిత పొగాకు ఉత్పత్తులు, గుట్కా మరియు మాదకద్రవ్యాల విక్రయాలను అరికట్టేందుకు శంషాబాద్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. శంషాబాద్ పోలీసులతో పాటు ఈగల్స్, నార్కోటిక్ డ్రగ్ టీమ్ సంయుక్తంగా పాలమాకుల, పెద్ద షాపూర్, ముచ్చింతల గ్రామాల పరిధిలోని పలు కిరాణా దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. తనిఖీల సందర్భంగా పాలమాకుల గ్రామానికి చెందిన ప్రవీణ్ కుమార్, రోహిత్ కుమార్ నిర్వహిస్తున్న కిరాణా దుకాణాల్లో నిషేధిత టొబాకో ఉత్పత్తులు, గుట్కా ప్యాకెట్లు నిల్వ ఉంచి విక్రయిస్తున్నట్లు గుర్తించారు.

దీంతో పోలీసులు ఆయా నిషేధిత వస్తువులను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ...నిషేధిత పొగాకు ఉత్పత్తుల విక్రయాలపై నిరంతరం నిఘా ఉంటుందని, నిషేధిత పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## అడుగంటిన

# కోటా!




**ఎరువుల దుకాణాలలో నో స్టాక్ బోర్డులు**
**దొడ్డిదారిన బ్లాక్‌మార్కెట్**
**రూ.1,350 ఉన్న డిఎపి 1,500 వరకు వసూళ్లు**
**రూ.266 ధర పలికే యూరియా 350కు విక్రయం**



**★వందల మెట్రిక్ టన్నుల యూరియా కొరత! ★ఉదాసీనత వీడని అధికారులు ★కలెక్టర్ మాటకూ దక్కని గౌరవం! ★నిస్సహాయంగా ధారూర్ రైతులు ★మండలంలో 21వేల ఎకరాలలో సాగుకు సమాయత్తం ★గత సీజన్లో 479 మెట్రిక్ టన్నుల యూరియా వినియోగం ★పెరిగిన సాగు విస్తీర్ణంతో ఈ ఏడాది 20 నుంచి 30 శాతం అదనంగా అవసరం**

**ధారూర్, జూన్ 14 ప్రభాతవార్త:** ధారూర్ మండలంలో తొలకరి పలకరింపుతో రైతులు ఎంతో ఆశతో చేలను సిద్ధం చేసుకుని సాగు పనులను ప్రారంభించారు. కానీ, విత్తనం నాటేందుకు అవసరమైన బలాన్ని చ్చే ఎరువులు మాత్రం మార్కెట్‌లో మచ్చుకైనా దొరకడం లేదు. డీఏపీ, యూరియా, 2020 వంటి కీలకమైన ఎరువులు ఏ దుకాణంలోనూ లభించకపోవడంతో రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. మండలంలో ఎన్నో విత్తన, ఎరువుల దుకాణాలు ఉన్నప్పటికీ ఎక్కడా ఒక్క బస్తా ఎరువు కూడా అందుబాటులో లేకపోవడం గమనార్హం.

**గంటల తరబడి నిరీక్షణ**

ఎక్కడైనా కొద్దిగా స్టాక్ ఉందనే సమాచారంతో వెళ్తే, అక్కడ రైతులు గంటల తరబడి బారులు తీరాల్సి వస్తోంది. రైతుల ఇబ్బందులను గమనించిన జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ స్వయంగా ఈ నెల 19వ తేదీన మండలంలోని భీమన గ్రోమోర్ దుకాణాన్ని సందర్శించారు. మరుసటి రోజు కల్లా రైతులకు డీఏపీ ఎరువులను అందుబాటులోకి తీసుకురావాలని దుకాణ నిర్వాహకులను గట్టిగా ఆదేశించడమే కాకుండా, జిల్లా, మండల వ్యవసాయ అధికారులు దగ్గరుండి రైతులకు ఎరువులు అందేలా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. కానీ కలెక్టర్ ఆదేశాలు ఇచ్చి రోజులు గడుస్తున్నా క్షేత్రస్థాయిలో ఫలితం మాత్రం శూన్యంగా మారింది. సాక్షాత్తూ జిల్లా కలెక్టర్ మాటలనే దుకాణదారులు, అధికారులు ఖాతరు చేయడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అధికారులు సైతం ఈ సమస్యను పట్టించుకోకపోవడంతో మండల రైతాంగం తీవ్ర అసహనం వ్యక్తం చేస్తోంది. సమస్యలు చెప్పుకుందామని స్థానిక మండల వ్యవసాయ అధికారికి ఫోన్ చేస్తే కనీసం ఫోన్ కూడా ఎత్తడం లేదని రైతులు మండిపడుతున్నారు.

**తెరవెనుక బ్లాక్ దందా**

ఎరువులు లేవని బోర్డులు తిప్పేస్తున్న కొందరు దుకాణదారులు, తెరవెనుక మాత్రం నల్లబజారుకు తెరలేపినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఉన్న ఎరువులను విచ్చలవిడిగా అధిక ధరలకు విక్రయిస్తూ, దీనిపై ఎవరైనా ప్రశ్నిస్తే వారికి ఒక్క సంచి కూడా ఇవ్వబోమని తెగేసి చెబుతుండటంతో రైతులు నోరుమెదపలేకపోతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం లభించాల్సిన ధరలకు, ప్రస్తుత బ్లాక్ మార్కెట్ ధరలకు భారీ తేడా కనిపిస్తోంది. డీఏపీ అసలు ధర రూ.1,350 ఉండగా, దుకాణదారులు రూ.1,500 వరకు గుంజుతున్నారు. యూరియా అసలు ధర రూ.266 ఉండగా, దాన్ని ఏకంగా రూ.350కు విక్రయిస్తూ అడ్డగోలుగా దోచుకుంటున్నారు.

**ఆన్‌లైన్ వ్యవస్థ అస్తవ్యస్తం**

పోనీ, యూరియాను ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకుందామంటే వ్యవసాయ అధికారులు దాన్ని ఆన్‌లైన్ సిస్టమ్‌లో సిస్టమ్లో పెట్టడం లేదని తెలుస్తోంది. అధికారుల ఉదాసీనత దుకాణదారులకు వరంగా మారి, యూరియా సంచులను యథేచ్ఛగా పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**ఇక్కడ దొరకక ఎక్కడి నుంచో కొనుగోళ్లు**

మండలంలో ఎరువులు దొరకకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో కొందరు రైతులు వికారాబాద్, తాండూర్ వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. అక్కడ ఎరువులు తెచ్చుకుందామంటే ఒక్కొక్క బస్తా రవాణా ఖర్చులకే ..80 నుండి ..100 వరకు అదనపు భారం పడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, తాము ఇండెంట్ పెట్టినప్పటికీ ఇప్పటివరకు పైనుంచి ఎరువుల సరఫరా రాలేదని కొందరు దుకాణ నిర్వాహకులు చెబుతున్నారు.

**పిఎసిఎస్‌లకు అరకొర సరఫరా**

రెండు రోజుల క్రితం ధారూర్, హరిదాసు పల్లి పిఎసిఎస్ కేంద్రాలకు కేవలం 200 సంచుల డీఏపీ రాగా, అక్కడి అవసరాలకు ఆ కొద్దిపాటి కోటా ఏమాత్రం సరిపోలేదు. ధారూర్ మండలంలో ఈసారి సాగు విస్తీర్ణం భారీగా ఉంది. మండల వ్యాప్తంగా దాదాపు పత్తి 6,000 నుండి 7,000 ఎకరాలు, వరి 6,000 ఎకరాలు, కందులు, 5,000 ఎకరాలు మొక్కజొన్న, 3,000 ఎకరాలు పెసలు 800 ఎకరాలు, మినుములు 200 ఎకరాల వరకు సాగవుతున్నాయి. గత సీజన్లో మండలంలో దాదాపు 225 మెట్రిక్ టన్నుల డీఏపీ, 274 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమవగా, ఈ సారి సాగు పెరగడంతో దాదాపు 300 మెట్రిక్ టన్నుల డీఏపీ, 295 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని అధికారులు అంచనా వేశారు. కానీ, ఇప్పటివరకు మండలానికి కేవలం 25 మెట్రిక్ టన్నుల ఎరువులు మాత్రమే రావడం గమనార్హం. ఈ అరకొర సరఫరా ఏ మూలకూ సరిపోవడం లేదు.

ఇంత జరుగుతున్నా వ్యవసాయ అధికారుల్లో చలనం రాకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ, ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, ధారూర్ మండలానికి పెరిగిన విస్తీర్ణానికి అనుగుణంగా తగినంత ఎరువుల కోటాను విడుదల చేయించాలని, నల్లబజారు విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుని అన్నదాతలను ఆదుకోవాలని మండల రైతులు బలంగా డిమాండ్ చేస్తున్నారు.

# కొనుగోళ్లలో కిరికిరి



ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఆందోళన వ్యక్తం చేస్తున్న బాధిత రైతులు

**◆ఫోర్జరీ సంతకాలతో బిల్లులు తారుమారు ◆జగ్గంగూడ ధాన్యం కేంద్రం సిబ్బంది నిర్వాకం ◆తరుగు పేరుతో లారీకి ఏకంగా 66 బస్తాలు కోత ◆బినామీ రైతుల పేరుతో స్వాహా ◆అక్రమాలపై ఇన్‌ఛార్జిని నిగ్గదీసిన రైతులు ◆శామీర్‌పేట పోలీసులకు ఫిర్యాదు ◆కలెక్టర్ దృష్టికి తీసుకెళతా: ఏఎంసి చైర్మన్**

**శామీర్‌పేట, (మేడ్చల్ జిల్లా ప్రతినిధి) జూన్ 14, ప్రభాతవార్త :** మేడ్చల్ జిల్లా, శామీర్‌పేట పరిధిలోని మూడుచింతలపల్లి మండలం జగ్గంగూడ ధాన్యం కొనుగోలు కేంద్రంలో పెద్ద ఎత్తున అవతవకలు జరుగుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం ఇన్‌ఛార్జి రాము తమకు తెలియకుండానే బిల్లులు మారుస్తున్నారని, ఫోర్జరీ సంతకాలు చేసి కోతలు విధిస్తున్నారని బాధిత రైతులు (మైర విష్ణువర్ధన్‌రెడ్డి, మజ్జిగ సత్తయ్య, బలమైన వీరేశ్, దుడ్డెల సురేశ్, నాగుల ప్రహ్లాద్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు) ఆరోపించారు. క్వింటాలుకు సుమారు రూ. 2,300 చెల్లించాల్సి ఉండగా, ధాన్యం తీసుకున్న సమయంలో రైతులకు ఎలాంటి రశీదులు ఇవ్వడం లేదని వారు వాపోయారు. ఒక లారీ లోడ్‌లో 810 బస్తాల ధాన్యాన్ని మిల్లుకు తరలించినప్పుడు, తరుగు పేరిట 33 బస్తాలు తగ్గించాల్సింది పోయి ఏకంగా 66 బస్తాలు తగ్గించి బిల్లులు చేశారని రైతులు విమర్శించారు. ప్రతి లారీ లోడ్ పంపే సమయంలో అటు మిల్లు వారు, ఇటు కేంద్రం నిర్వాహకులు బస్తాలు తగ్గించి, మిగిలిన ధాన్యాన్ని బినామీ రైతుల పేరిట కాజేస్తున్నారని ఆరోపించారు. దీనిపై ఇన్‌ఛార్జి రామును నిలదీయగా, అలియాబాద్ సెంటర్ విజయ్ సూచనల మేరకే తాను ఇలా తగ్గిస్తున్నట్లు సమాధానమిచ్చారని రైతులు తెలిపారు.

**ప్రభుత్వానికి చెడ్డపేరు తేకండి: ఏఎంసి చైర్మన్**

మరోవైపు కొనుగోలు ప్రక్రియ నత్తనడకన సాగుతుండటంతో రైతులు రోజుల తరబడి వాహనాల్లో ధాన్యం పెట్టుకుని వేచి చూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాల కారణంగా ధాన్యం తడిసిపోయే ప్రమాదం ఉందని, వెంటనే కొనుగోళ్లు జరపాలని డిమాండ్ చేశారు. ఈ అక్రమాలపై బాధిత రైతులు శామీర్‌పేట పోలీసులకు సమాచారం అందించడమే కాకుండా, కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. మేడ్చల్ ఏఎంసి చైర్మన్ బి. నర్సింలు యాదవ్ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా వ్యవహరిస్తూ, రైతులకు అన్యాయం చేసే ఏ అధికారిని లేదా నిర్వాహకుడినైనా వదిలిపెట్టే ప్రసక్తి లేదని, దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

# ఆటలకు టాటా



**నేటి నుంచి ప్రభుత్వ పాఠశాలల పునఃప్రారంభం**
**ముందస్తుగానే పాఠ్యపుస్తకాలు సరఫరా**
**నాలుగైదు రోజుల్లో అందుబాటులోకి యూనిఫారాలు**
**మధ్యాహ్న భోజన వసతులకు ఏర్పాట్లు పూర్తి**
**ఎమ్మెల్యేల చేతులమీదుగా అల్పాహార పథకం ప్రారంభం**
**బడిబాట ఫలితంగా కొత్తగా ఐదు వేల మంది విద్యార్థులు పెరిగే అవకాశం**

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** యాభై రోజుల వేసవి సెలవుల తర్వాత వికారాబాద్ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లు ఈనెల 15 నుంచి పునఃప్రారంభం కానున్నాయి. ఈసారి ప్రభుత్వం విద్యార్థులకు ముందస్తుగానే పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను సరఫరా చేసింది. నాలుగైదు రోజుల్లో యూనిఫారాలు కూడా రానున్నట్లు సమాచారం. అనివార్య కారణాలు ఏవైనా ఉంటే కొంత జాప్యం జరగొచ్చు. విద్యార్థుల మధ్యాహ్నం భోజన వసతులకు కూడా అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. బడి బాట కార్యక్రమం ద్వారా ఈసారి కొత్తగా ఐదు వేల మంది విద్యార్థులు చేరవచ్చని అంచనా. వికారాబాద్ జిల్లాలో మొత్తం 1,066 ప్రభుత్వ స్కూళ్లు ఉన్నాయి. వాటిలో ప్రాథమిక పాఠశాలలు 774, ప్రాథమికోన్నత పాఠశాలలు 116, ఉన్నత పాఠశాలలు 176 ఉన్నాయి. ఈ ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 65 వేల మంది ర్థులు చదువుకుంటున్నారు.

**హరేకృష్ణ ఫౌండేషన్ ద్వారా అల్పాహార సేవలు**

తాండూరు నియోజకవర్గంలో హరేకృష్ణ ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు అల్పాహారం అందజేయనున్నారు. పట్టణంలోని ప్రభుత్వ నెంబర్ వన్ స్కూలులో ఎమ్మెల్యే బి.మనోహర్‌రెడ్డి చేతుల మీదుగా దీనిని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు. కొడంగల్ యోజకవర్గంలో గత రెండేళ్లుగా ఈ సంస్థ ఉచితంగా అల్పాహారం అందజేస్తోంది. పరిగి యోజకవర్గంలో అక్షయపాత్ర ద్వారా అల్పాహారం అందజేస్తున్నట్లు డీఈవో ఘనీ తెలిపారు.

**గ్రామాల్లో రేషనలైజేషన్ ఆందోళనలు**

చాలా ప్రభుత్వ స్కూళ్లలో టీచర్ల కొరత తీవ్రంగా వేధిస్తోంది. విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయులను కేటాయించే రేషనలైజేషన్ ప్రక్రియ జరిగితే, మారుమూల పాఠశాలల్లో పోస్టుల సంఖ్య తగ్గవచ్చని భావిస్తున్నారు. దీనివల్ల మల్టీ గ్రేడ్ టీచింగ్ పెరిగి, టీచర్లపై అదనపు భారం పడుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఆగని ప్రైవేట్ పాఠశాలల దోపిడీ ధనార్జనే ధ్యేయంగా పనిచేస్తున్న పలు ప్రైవేట్ పాఠశాలల తీరులో ఎలాంటి మార్పు లేదు. పూర్తిస్థాయి వసతులు, నిబంధనలు లేకపోయినా పాఠశాలలను యథావిధిగా కొనసాగిస్తున్నారు. విద్యాశాఖ అధికారులు ఆరంభంలో కఠినంగా వ్యవహరించి, ఆ తర్వాత మెత్తబడటం పరిపాటిగా మారింది. ఫీజులపై ప్రభుత్వ నియంత్రణ లేకపోవడంతో ఇష్టారాజ్యంగా వసూళ్లు చేస్తున్నారు. చాలీచాలని గదులు, సరైన గాలి, వెలుతురు లేని వాతావరణంలో బోధన సాగడం వల్ల విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పలు కొత్త స్కూళ్లకు అనుమతులు లభించాయి. విద్యాశాఖ ద్వారా అనుమతులు ఇప్పించే పేరిట కొందరు బ్రోకర్లు భారీగా డబ్బులు దండుకుంటున్నారు.



రెడ్‌క్రాస్ మేడ్చల్ జిల్లా శాఖ చైర్మన్ రాజేశ్వర్‌రావుకు పురస్కారం అందిస్తున్న గవర్నర్ శివప్రతాప్‌శుక్లా

## రెడ్ క్రాస్ సేవలు భేష్

### గవర్నర్ శివప్రతాప్ శుక్లా కితాబు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూన్ 14, ప్రభాతవార్త:** ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని లోక్ భవన్‌లోని సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో భారత రెడ్ క్రాస్ సొసైటీ (తెలంగాణ రాష్ట్ర శాఖ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా ప్రారంభించారు. సమాజంలో రక్తదానంపై అవగాహన కల్పిస్తూ విశిష్ట సేవలు అందించినందుకు గానూ మేడ్చల్ జిల్లా రెడ్ క్రాస్ శాఖ చైర్మన్, రాష్ట్ర ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఓఎస్డీ అయిన డాక్టర్ ఎస్.ఎం. రాజేశ్వర్ రావును గవర్నర్ సత్కరించి పురస్కారాన్ని అందజేశారు. అత్యధిక సార్లు రక్తదానం చేసిన దాతలు, విశిష్ట సేవలు అందించిన వైద్యులు, సిఎస్ఆర్ కింద రెడ్ క్రాస్ సొసైటీకి సహకారం అందించిన సంస్థల ప్రతినిధులను గవర్నర్ సత్కరించారు. 2023 నుండి 2026 వరకు 113 రక్తదాన శిబిరాలను నిర్వహించి, 8,279 యూనిట్ల రక్తాన్ని సేకరించారని, ఈ రక్తం తలసేమియా, క్యాన్సర్ రోగులకు ఎంతో ఉపయోగపడిందని అభినందించారు. అదేవిధంగా 467 ఉచిత వైద్య శిబిరాల ద్వారా వృద్ధులు, దివ్యాంగులు, గిరిజన ప్రాంతాల ప్రజలతో కలిపి మొత్తం 24,142 మందికి పైగా వైద్య సేవలు అందించామని నిర్వాహకులు వివరించారు. అత్యవసర సమయాల్లో ప్రాణాలను కాపాడేందుకు గానూ 20 సిపిఆర్, ఫస్ట్ ఎయిడ్ శిక్షణ కార్యక్రమాల ద్వారా 1,865 మందికి శిక్షణ ఇచ్చారు. శామీర్‌పేటలో వృద్ధుల కోసం ప్రణామ్ డే కేర్ సెంటర్, బోయినపల్లిలో మిస్రీలాల్ మంగీలాల్ మాతా శిశు ఆసుపత్రిని నిర్వహిస్తూ పేద కుటుంబాలకు వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చారు. టీబి ముక్త్ అభియాన్, ఆయుష్మాన్ భారత్ పథకం నమోదు, వరద బాధితులకు సహాయక చర్యలు, మరియు యువ రెడ్ క్రాస్ వంటి అనేక సామాజిక సేవా కార్యక్రమాలను రాజేశ్వర్ రావు సమర్థవంతంగా అమలు చేస్తున్నారని గవర్నర్ కొనియాడారు.

# యమపాశాలు

**షాద్‌నగర్‌లో ప్రమాదకరంగా మారిన కేబుల్ వైర్లు**
**విద్యుత్ స్తంభాలకు అంటుకుంటున్న మంటలు**
**నిబంధనలకు విరుద్ధంగా పదుల వరుసలతో వైర్ల వ్యవస్థ**
**గాలివాన సమయాల్లో పొంచి ఉన్న పెనుముప్పు!**



షాద్‌నగర్‌లో కేబుల్ జంక్షన్ బాక్స్ నుంచి మంటలు వ్యాపిస్తున్న దృశ్యం

**షాద్‌నగర్, జూన్ 14 ప్రభాతవార్త:** షాద్ నగర్ పట్టణ కేంద్రంలో రాత్రి సమయంలో విద్యుత్ స్తంభాలకు మంటలు అంటుకున్నాయి. వాటికి ఏర్పాటుచేసిన నెట్ కేబుల్స్ జంక్షన్ బాక్స్‌లో మొదట మంటలు చెలరేగి, అవి స్తంభానికి పెద్ద ఎత్తున వ్యాపించాయి. వెంటనే సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ అధికారులు మంటను ఆర్పేందుకు అగ్నిమాపక సిబ్బందిని సంప్రదించారు. ప్రమాద తీవ్రతను తగ్గించేందుకు విద్యుత్ సరఫరాను నిలిపివేసి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. పట్టణ ఏఈ వినోద్ తదితర సిబ్బంది సకాలంలో స్పందించి చర్యలు తీసుకోవడంతో భారీ ప్రమాదం సంభవించకుండా తప్పింది. ఇదిలా ఉండగా, షాద్ నగర్‌లో విద్యుత్ స్తంభాలపై ఏర్పాటు చేస్తున్న కేబుల్ టీవీ, ఇంటర్నెట్, టెలిఫోన్ వైర్లు పలు ప్రాంతాలలో తీవ్ర ప్రమాదకరంగా మారుతున్నాయి. సాధారణంగా విద్యుత్ స్తంభాలపై కేవలం నాలుగైదు వరుసలతో మాత్రమే కరెంటు తీగలు ఉండాలి. కానీ అందుకు విరుద్ధంగా ఆ స్తంభాలపై పదుల వరుసలతో కూడిన కేబుల్ వైర్లు దాదాపు అన్ని ప్రాంతాలలో వేలాడుతూ కనిపిస్తున్నాయి. ఇవి నిరంతరం ప్రమాదాలకు కారణమవుతుండటంతో షాద్ నగర్ పట్టణ ప్రజలతో పాటు ఆయా ప్రాంతాల్లోని వ్యాపారులు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా గాలి దుమారానికి విద్యుత్ తీగలు ఒకదానికొకటి తగిలినప్పుడు మెరుపులు వచ్చి, అవి కింద ఉన్న కేబుళ్ల మీద పడి మంటలు వస్తున్నాయి. ఇటువంటి సంఘటనలు నిత్యం ప్రధాన రహదారుల మీదే జరుగుతుండటంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. నగరంలో కమ్యూనికేషన్ వ్యవస్థ పూర్తిగా ప్రైవేటు సంస్థల పరిధిలోనే నడుస్తోంది. కేబుల్ టీవీ, ఇంటర్నెట్, టెలిఫోన్ సర్వీసు ప్రొవైడర్లు ఎవరికీ వారుగా తమ కంపెనీకి చెందిన పెద్ద ఎత్తున తీగలను విద్యుత్ స్తంభాలకు వేలాడదీస్తూ ఏర్పాటు చేస్తున్నారు.

**కేబుల్ ఆపరేట్ల ఇష్టారాజ్యం**

ఈ విషయంలో మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులు ఎలాంటి అభ్యంతరాలు చెప్పకపోవడంతో ఇష్టారాజ్యంగా కేబుళ్లు ఏర్పాటవుతున్నాయి. షాద్ నగర్ పట్టణంలో ఇవి ఇప్పుడు నిత్య కృత్యం అయ్యాయి. ముఖ్యంగా విద్యుత్ శాఖకు చెందిన స్తంభాలపై కేబుళ్లు ఏర్పాటు చేసేందుకు ఆ శాఖ నుంచి ఎలాంటి అనుమతి కూడా తీసుకోవడం లేదు. ఒకవేళ అనుమతి తీసుకున్నప్పటికీ అధికారులు వీటిని పట్టించుకునే అవకాశాలు లేకపోలేదు. అదే విధంగా మున్సిపల్ శాఖ సైతం ఈ విషయాన్ని పూర్తిగా నిరక్ష్యం చేయడంతో కేబుళ్లు విపరీతంగా పెరిగిపోతున్నాయి.

**శాఖల మధ్య సమన్వయలోపం**

ఈ విషయంలో సమన్వయంతో వ్యవహరించాల్సిన ప్రభుత్వ శాఖలు బాధ్యతా రాహిత్యంగా వ్యవహరి స్తున్నాయన్న ఆరోపణలు గట్టిగా వినిపి స్తున్నాయి. ఈ కేబుళ్ల వల్ల విద్యుత్ సిబ్బందికి మరమ్మతుల సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సిబ్బంది స్తంభాలను ఎక్కి మరమ్మతులు చేయాల్సి వచ్చినప్పుడు కుప్పలుతెప్పలుగా ఉంటున్న కేబుల్ తీగలు పెద్ద అడ్డంకిగా మారుతున్నాయి. దీనికోసం భారీ క్రేన్లను తెప్పించి కేబుళ్లు తగలకుండా పనులు చేయాల్సి వస్తోందని, అయినా ఆ సమయంలో అవి తమ క్రేన్లకు అడ్డుగా వస్తున్నాయని విద్యుత్ శాఖ సిబ్బంది పేర్కొంటున్నారు. దీనికితోడు రహదారులపై భారీ వాహనాలు వెళ్లినప్పుడు కిందకు



వివరాలను వెల్లడిస్తున్న ఎన్నికల కమిటీ చైర్మన్ ఎద్దుల రవీందర్

## జూలై 5న అరుంధతీ సేవా మండలి కేంద్ర కమిటీ ఎన్నికలు

**గోషామహల్, జూన్ 14 ప్రభాతవార్త:** అరుంధతీ సేవా మండలి కేంద్ర కమిటీ ఎన్నికలను వచ్చే నెల 5వ తేదీన నిర్వహించడం జరుగుతుందని ఎన్నికల చైర్మన్ ఎద్దుల రవీందర్, వైస్ చైర్మన్ పాలెం వెంకటేష్ ప్రకటించారు. ఆదివారం మండలి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎన్నికల కమిటీ సభ్యులు డి.యాదయ్య, జెన్ను శ్యామ్, మిరదొడ్డ లక్ష్మీనారాయణ, దేవేందర్‌లతో కలిసి వారు ఎన్నికల వివరాలను తెలిపారు. జూన్ 18, 19 తేదీలలో నామినేషన్ పత్రాలను ఇస్తామన్నారు. 20, 21వ తేదీన అధ్యక్ష పదవి నామినేషన్లను స్వీకరించడం జరుగుతుందని చెప్పారు. జూన్ 22వ తేదీన ఉపసంహరణ, 23వ తేదీన స్క్రూటినీ, అదేరోజు సాయంత్రం 5 గంటలకు అభ్యర్థులకు గుర్తులను కేటాయిస్తామని వెల్లడించారు. అరుంధతీ సేవా మండలి కేంద్ర కమిటీ అధ్యక్ష పదవికి పోటీచేసేవారు నామినేషన్ పత్రాలతోపాటు రూ. 21 వేల ధరావత్తు చెల్లించాలన్నారు. అధ్యక్ష పదవికి రంగంలో ఉన్న అభ్యర్థులు కేంద్ర కమిటీ కింద ఉన్న 26 బస్తీలలో జూన్ 24వ తేదీ నుంచి ప్రచారం చేసుకోవచ్చన్నారు. ప్రశాంత వాతావరణంలో సంఘం ఎన్నికల ప్రచారం చేసుకోవాలని, బస్తీల సంఘాల నుంచి ఏమైనా ఫిర్యాదు వస్తే ఆ అభ్యర్థిని తొలగిస్తామని వారు తెలిపారు.

## లైంగిక దాడికి గురైన బాలికకు మెరుగైన వైద్యం అందించాలి

### మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గద్వాల విజయలక్ష్మి

**బేగంపేట జూన్ 14,ప్రభాతవార్త :** లైంగిక దాడికి గురైన బాలికకు మెరుగైన వైద్యం అందించాలని తెలంగాణ మహిళా కమిషన్ చైర్ పర్సన్ గద్వాల విజయలక్ష్మి అన్నారు. లైంగిక దాడికి గురై నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఖమ్మం మైనర్ బాలికను తెలంగాణ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె బాలిక కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. బాలిక కుటుంబానికి అండగా ఉంటామంటూ హామీ ఇచ్చారు. ప్రత్యేకంగా నిమ్స్ డైరెక్టర్ పర్యవేక్షణలో బాలికకు మెరుగైన వైద్యం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. బాలిక ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటి కప్పుడు వివరాలను అడిగి తెల్సుకుంటున్నామన్నారు. నిందితుడిని ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారించి కఠినంగా శిక్షించేలా చూస్తామన్నారు. ప్రభుత్వం, మహిళా కమిషన్ బాలికకు, వారి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. బాలికను పరామర్శించిన వారిలో చైర్‌పర్సన్ వెంట మహిళా కమిషన్ సభ్యులు ఉన్నారు.

## ఓపెన్ వర్శిటీ విద్యార్థులకు ఉచిత నైపుణ్య శిక్షణ



ఓపెన్ వర్శిటీ పరీక్షలను పరిశీలిస్తున్న డా. వెంకటేశ్వర్లు, రాజ్యలక్ష్మి

**బేగంపేట, జూన్ 14, ప్రభాతవార్త :** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఒపెన్‌వర్సిటీ) విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ ద్వారా ఉచిత నైపుణ్య శిక్షణ అందించనున్నట్లు వర్సిటీ విద్యార్థి సేవావిభాగ డైరెక్టర్ డా. ఎల్.వీ.ఎస్.బీ.వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జరుగుతున్న ఓపెన్ వర్శిటీ పరీక్షలను అడ్వర్ రాజ్యలక్ష్మితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీకాం విద్యార్థులకు అకౌంటెంట్ అసిస్టెంట్, జీఎస్టీ విభాగాల్లో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలియజేసారు. అలాగే బీఏ,బీఎస్సీ లతో పాటు ఇతర కోర్సుల విద్యార్థులకు బేసిక్ కంప్యూటర్స్, సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, ఎలక్ట్రికల్, హౌస్ వైరింగ్ రంగాల్లో శిక్షణ ఇస్తామన్నారు. మహిళా విద్యార్థులకు అడ్వాన్స్ టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, జర్దోజీ వర్కుల్లో నైపుణ్య శిక్షణ కల్పిస్తామని చెప్పారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం జలాల్‌పూర్ గ్రామంలో ఉన్న స్వామి రామానందతీర్థ రూరల్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న ఓపెన్ వర్సిటీ విద్యార్థులు మరిన్ని వివరాల కోసం విశ్వవిద్యాలయ సిబ్బందిని సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు కో ఆర్డినేటర్ డా.ఏ.రామాచారి, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.


## స్మై ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం

**సికింద్రాబాద్, జూన్ 14 ప్రభాతవార్త :** స్మై ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలో 302వ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు ప్రత్యేక వాహనంలో నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. రోడ్ల పక్కన, ఫుట్‌పాత్‌లపై నివసిస్తున్న ఆకలితో అలమటిస్తున్న అనాథలు, నిరాశ్రయులు, సంచార జాతుల వారిని మానవతా దృక్పథంతో గుర్తించి, వారికి రుచికరమైన భోజనాన్ని పంపిణీ చేశారు. ఈ సేవా కార్యక్రమంలో స్మై ఫౌండర్ అండ్ ప్రెసిడెంట్ డాక్టర్ వై. సంజీవ కుమార్, వైస్ ప్రెసిడెంట్ పావని.ఓ., సేవా సభ్యులు అఖిల్ తదితరులు పాల్గొని స్వయంగా ఆహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రెసిడెంట్ డాక్టర్ వై. సంజీవ కుమార్ మాట్లాడుతూ, సమాజంలో ఆకలితో బాధపడుతున్న తోటి మానవులకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పిలుపునిచ్చారు. [illegible] ప్రతి ఒక్కరూ ఇలాంటి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలన్నారు. స్మై ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇలాంటి నిరంతర సేవా కార్యక్రమాలు భవిష్యత్తులోనూ నిరంతరాయంగా కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు.

## పేదలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలి

### జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. పుట్ల శ్రీనివాస్

**మెట్టుగూడ, జూన్ 14 ప్రభాతవార్త:** పేదలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందేలా అధికారులు, సిబ్బంది శ్రద్ధవహించాలని హైదరాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా. పుట్ల శ్రీనివాస్ సూచించారు. ఆదివారం మెట్టుగూడ అర్బన్ ప్రైమరీ హెల్త్‌సెంటర్ పరిధిలోని చింతబావిబస్తీ దవాఖానను ఆయన ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్టర్, రోగులకు అందుతున్న వైద్య సేవలు, రికార్డులు, ఔషధాల లభ్యత, దవాఖాన పరిశుభ్రత పరిస్థితులను ఆయన పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ సమయపాలన పాటిస్తూ, అన్ని రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించడంతోపాటు దవాఖాన ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలని డా. పుట్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. బస్తీ దవాఖాన పరిధిలోని పేద ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు, అవసరమైన పరీక్షలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తనిఖీ సమయంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డా. శ్రీధర్‌తో పాటు బస్తీ దవాఖాన వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.




బస్తీ దవాఖానలో సిబ్బందితో మాట్లాడుతున్న డా. పుట్ల శ్రీనివాస్

# విహార కేంద్రంగా హెచ్‌ఎంటీ నగర్ పెద్ద చెరువు

### ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**నాచారం, జూన్ 14 ప్రభాతవార్త :** ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధిలో మరో కీలక ఘట్టానికి శ్రీకారం చుడుతూ నాచారం డివిజన్ పరిధిలోని హెచ్‌ఎంటీ నగర్ పెద్ద చెరువు సుందరీకరణ పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. రూ.37.50 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టు ద్వారా చెరువును ఆధునిక విహార కేంద్రంగా తీర్చిదిద్దనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లుగా స్థానిక ప్రజలు ఎదురుచూస్తున్న హెచ్‌ఎంటీ నగర్ పెద్ద చెరువు అభివృద్ధి పనులు ప్రారంభం కావడం సంతోషకరమని పేర్కొన్నారు. చెరువును కేవలం నీటివనరుగా మాత్రమే కాకుండా పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే ప్రత్యేక ఆకర్షణగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ప్రాజెక్టులో భాగంగా చెరువు చుట్టూ ఆధునిక వాకింగ్ ట్రాక్‌లు, సైక్లింగ్‌ట్రాక్‌లు, సుందరమైన ల్యాండ్‌స్కేపింగ్, హరితవనాలు, సిట్టింగ్ ఏరియాలు, అలంకార విద్యుత్ దీపాలు, చిన్నారుల ఆట స్థలాలు, ఫుడ్ కోర్టులు, పర్యావరణహిత సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.



చెరువు సుందరీకరణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

పనులు పూర్తయిన అనంతరం హెచ్‌ఎంటీ నగర్ పరిసర ప్రాంతం నగరవాసులకు ప్రధాన విహార కేంద్రంగా మారుతుందని ఆయన తెలిపారు. చెరువు పరిరక్షణ, వర్షపు నీటి నిల్వ సామర్థ్యం పెంపు, భూగర్భ జలాల సంరక్షణకు ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని పేర్కొన్న ఎమ్మెల్యే, అభివృద్ధి పనులు పూర్తయిన తర్వాత పరిసర ప్రాంతాల రూపురేఖలు పూర్తిగా మారిపోవడంతో పాటు ఆస్తుల విలువలు కూడా పెరుగుతాయని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం, మౌలిక సదుపాయాల కల్పన, పర్యావరణ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఉప్పల్ నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాన్ని మాజీ కార్పొరేటర్ శాంతిసాయిజన్ శేఖర్, బీఆర్‌ఎస్ నాయకులు సాయిజన్ శేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. చెరువు అభివృద్ధి పనులు ప్రారంభం కావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ సాంస్కృతి సంప్రదాయాలను తెలియ జేసే విధంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

## జేఎన్టీయూహెచ్ నూతన డైరెక్టర్‌గా డాక్టర్ దామోదరం, రిజిస్టర్‌గా డాక్టర్ జయలక్ష్మి నియామకం

**కెపిహెచ్‌బి కాలనీ, జూన్ 14, ప్రభాతవార్త :** కూకట్‌పల్లి జేఎన్టీయూహెచ్ నూతన రెక్టర్‌గా డాక్టర్ దామోదరం, రిజిస్టర్‌గా డాక్టర్ ఏ.జయలక్ష్మిలు నియమితులయ్యారు. యూసీఈఎస్‌టీహెచ్‌లోని కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ (సీఎస్ఈ) విభాగం కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్ సీనియర్ ప్రొఫెసర్ డా.ఎ. దామోదరం, జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ హైదరాబాద్‌కు రెక్టర్‌గా నియమితులయ్యారు. ఆయన యూసీఈఎస్‌టీహెచ్‌లోని మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం మెకానికల్ ఇంజనీరింగ్ సీనియర్ ప్రొఫెసర్ డా. కె. విజయకుమార్‌రెడ్డి నుండి బాధ్యతలు స్వీకరించారు. అలాగే యూసీఈఎస్‌టీహెచ్‌లోని ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ (ఈఈఈ) విభాగం ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ డా.ఎ. జయలక్ష్మి, జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ హైదరాబాద్‌కు రిజిస్ట్రార్‌గా నియమితులయ్యారు. ఆమె యూసీఈఎస్‌టీహెచ్‌లోని సెంటర్ ఫర్ నానో సైన్స్ అండ్ టెక్నాలజీ యొక్క నానో టెక్నాలజీ ప్రొఫెసర్ డా. కె. వెంకటేశ్వర రావు నుండి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జెఎన్టియు విద్యాపక బృందం, విద్యా ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్ అధికారులకు ఘన సన్మానం




ఎస్ఐ సందీప్‌రెడ్డి, అడ్మిన్ రమణలను సన్మానిస్తున్న దృశ్యం

**ఖైరతాబాద్, జూన్ 14,(ప్రభాతవార్త):** ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్‌లో మూడు సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న సెక్టార్ ఎస్ఐ సందీప్‌రెడ్డి, అడ్మిన్ రమణను బదిలీ సందర్భంగా ఆదివారం ఘనంగా సన్మానించారు. స్థానిక ప్రజలు, సామాజిక కార్యకర్తలు, ఆలయ ప్రతినిధులు కలిసి వారికి శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, సందీప్ రెడ్డి, రమణ ప్రజలకు అందుబాటులో ఉంటూ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకువచ్చారని కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారం, శాంతిభద్రతల నిర్వహణ, వివిధ సామాజిక కార్యక్రమాల్లో వారి సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. అనంతరం బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని శ్రీ హనుమాన్ టెంపుల్‌లో వేద పండితులు సీతారామ్ ప్రత్యేక ఆశీర్వచనాలు అందించి, భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షి ంచారు. సందీప్ రెడ్డి, రమణ తమ విధి నిర్వహణలో సహకరించిన ఉన్నతాధికారులు, సహచర సిబ్బంది, స్థానిక ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎక్కడ విధులు నిర్వహించినా ప్రజాసేవే లక్ష్యంగా పనిచేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.వీ.ఎల్.ఎన్. శాస్త్రీ, కె. నాగేశ్వరరావు, పులి సంతోష్, ఎస్. ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు.

## మల్లంపేట్‌లో ఉచిత వైద్య శిబిరం

**దుండిగల్, జూన్ 14, ప్రభాతవార్త :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని మల్లంపేట్ పోచమ్మ ఆలయం సమీపంలో నిర్వహించిన 46వ ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం తెలంగాణ స్టేట్ ప్రోటోకాల్ అండ్ కోఆర్డినేషన్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కిషోర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. మల్లంపేట్ కాలనీవాసులు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ముఖ్యంగా సాధారణ ఆరోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స పొందేందుకు ఇటువంటి శిబిరాలు దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని ఆకాంక్షించారు. వైద్యులు అందించే సూచనలు పాటిస్తూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కావలి గణేష్, పద్మారావు, మనోజ్ రెడ్డి, రేవంత్ రెడ్డి, గురవారెడ్డి, హరి, శ్రీనిధి, వాణి తదితరులతో పాటు మల్లంపేట్ కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉచిత వైద్య శిబిరంలో పలువురు ప్రజలు ఆరోగ్య పరీక్షలు చేయించుకుని వైద్యుల సూచనలు పొందారు.



పాటను విడుదల చేస్తున్న దర్శకుడు త్రినాథరావు

## చిన్న సినిమాలకు పెరుగుతున్న ఆదరణ

### - ప్రముఖ దర్శకులు త్రినాథరావు

**జూబ్లీహిల్స్, జూన్ 14, ప్రభాతవార్త :** సినిమాలో కథాబలం ఉంటే ప్రేక్షకులు ఆదరిస్తారని, కొద్ది కాలంగా కథాంశంతో ఉన్న చిన్న సినిమాలు పెద్ద విజయాలు సాధించాయని ప్రముఖ దర్శకుడు నక్కిన త్రినాథ రావు అన్నారు. సంగీత దర్శకుడు ఘంటాడి కృష్ణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'రిస్క్' చిత్రంలోని 'దేవుడు వరమందిస్తే' అనే పాటను ఆదివారం జూబ్లీహిల్స్‌లోని జర్నలిస్టు కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దర్శకుడు త్రినాథ రావు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో కొత్తదనంతో చక్కని కథలతో చిన్న సినిమాలకు ప్రేక్షకలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. దర్శకుడు ఘంటాడి కృష్ణ మాట్లాడుతూ సస్పెన్స్, యాక్షన్ ఎలిమెంట్స్‌తో ఈ చిత్రం రూపుదిద్దుకుంటుందన్నారు. వైవిధ్యభరితమైన కథాంశంతో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ చిత్రంలో హీరోగా సందీప్ అశ్వ నటిస్తుండగా, హీరోయిన్లుగా సన్యా ఠాకూర్, జోయాజవేరీలు నటిస్తున్నట్లు సినీ నిర్మాతలు సురేష్‌రెడ్డి, గుర్రం నర్సింహులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నటుడు వైవి.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ రంగారెడ్డి ఆర్‌ఎంగా శ్రీదేవి

**అఫ్జల్‌గంజ్, జూన్ 14 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ రంగారెడ్డి ఆర్‌టిసి రీజయన్ మేనేజర్‌గా శ్రీదేవి పదవి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఆర్‌ఎంగా కొనసాగిన శ్రీలత బర్కత్‌పురా డిపోకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో ఆర్‌టిసి ప్రధాన కార్యాలయంలో ఛీఫ్ ఇంజనీర్‌గా(ఐటి) విభాగం లో కొనసాగిన శ్రీదేవిని రంగారెడ్డి ఆర్‌టిసి రీజియన్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రంగారెడ్డి రీజినల్ పరిధిలో ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. అధికారులు, ఉద్యోగులు ఆర్.ఎం.శ్రీదేవిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## ఉర్రూతలూగించిన కహర్వా సంగీత విభావరి

**నాంపల్లి, జూన్ 14 ప్రభాతవార్త :** ప్రముఖ గాయకుడు ముంబయికి చెందిన మహమ్మద్ షకీల్, హైదరాబాద్‌కు చెందిన రవినితీష్ ప్రదర్శించిన కహర్వా సంగీత విభావరి ఆహుతులను తన్మయుల్ని చేసింది. మృదుల మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కనుల పండువగా నిర్వహించిన కహర్వా 2026 సంగీత వేడుకలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన కళాపోషకుడు షరీఫ్ జ్యోతిప్రకాసనంచేసి మృదుల చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘననివాళులర్పించారు. ఈ సందర్భంగా మహమ్మద్ షకీల్ తనకు గుర్తింపునిచ్చిన తొలి ఆల్బమ్‌లోని యే కసక్ దిల్‌కీ దిల్ మే పాటతో వీక్షకులను ఉర్రూతలూగించారు. ఆయా తేరే దర్‌పే దీవానా, కేసరియా లాంటి పాటలు ఆలపించి మంత్రముగ్ధులను చేశారు. జగ్జీత్‌సింగ్ గజల్స్ గానం, మధుర సంగీత గాయకుడు రవినిశేష్ హిందూస్థానీ సంగీత కచేరి మనోహరంగా సాగాయి. ఆరుగురు ఉస్తాదులు ఆలపించిన కృతులు ఆద్యంతం సంగీతప్రియులను ఓలలాడించారు. తబలాతో ఠాకూర్ హర్జీత్‌సింగ్, సితార్‌తో నందకుమార్, ఆక్టాప్యాడ్‌తో నీరజ్, కీబోర్డుతో ఉమర్‌ఖాన్ అద్భుత వాద్యసహకారం అందించి సంగీత ప్రదర్శనను మరింత రక్తికట్టించారు. సంస్థ డైరెక్టర్లు రవికాంత్ శ్రీవాస్తవ్, శిల్పి శ్రీవాస్తవ్, మృదు నిశేష్‌లు సమన్వయం చేశారు.




కహర్వా సంగీత విభావరిలో ఒక దృశ్యం

# ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ విద్యకు తెలంగాణా శ్రీకారం

### 9 వేల స్కూళ్లలో డిజిటల్ లెర్నింగ్

### రాష్ట్ర నోడల్ అధికారి డా. సరిత

**బేగంపేట జూన్ 14, ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను భవిష్యత్ సాంకేతిక ప్రపంచానికి సగర్వంగా సిద్ధం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక చారిత్రాత్మక ముందడుగు వేసింది. నూతన సాంకేతికతను అందిపుచ్చుకునేలా కృత్రిమ మేధస్సు(ఏఐ) డిజిటల్ లిటరసీ, కంప్యూటేషనల్ థింకింగ్ వంటి భవిష్యత్ నైపుణ్యాలను పాఠశాల స్థాయి నుంచే నేర్పించేందుకు కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్ టీచింగ్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్ ఆన్ ఏఐ డిజిటల్ లెర్నింగ్ అనే ప్రతిష్టాత్మక కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సిఎం రేవంత్ రెడ్డి దూరదృష్టితో విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి యోగితా రాణా ఆలోచనలకు అనుగుణంగా ఈ వినూత్న నమూనాను రూపొందించినట్లు రాష్ట్ర నోడల్ అధికారిగా నియమితులైన బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు డా. డి.సరిత తెలియజేసారు. ఈ కార్యక్రమంలో భాగంగా డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు అన్న అక్క మెంటర్‌షిప్ మోడల్ ద్వారా ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు మార్గదర్శకులుగా మారి డిజిటల్ విద్యను బోధించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమం అమలు కానుంది. ఇందులో భాగంగా 139 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, 53 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన 36,800 మంది విద్యార్థులు, ఇంటర్నల్ 33900 మంది డిగ్రీ, 2900 మంది పాలిటెక్నిక్ విద్యార్థులు, 9000 ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించనున్నారు. వీరితోపాటు 520 మంది నోడల్ ఫ్యాకల్టీ సభ్యులు భాగస్వాములు కానున్నారు. ఈ కార్యక్రమానికి జేఎన్‌టీయూ, ఉస్మానియా హైదరాబాద్ విశ్వవిద్యాలయాలు తమ సాంకేతిక, విద్యాపరమైన పూర్తి సహకారాన్ని అందిస్తున్నాయి. ఇప్పటికే 135 మంది ఇంజనీరింగ్ కళాశాలల మాస్టర్ ట్రైనర్లను ఎంపిక చేసి ప్రత్యేక శిక్షణ పూర్తి చేసారు. ఈ మొత్తం కార్యక్రమాన్ని ఐఏఎస్ అధికారి దేవసేన, కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బాలభాస్కర్, రాష్ట్ర నోడల్ అధికారిగా నియమితులైన డా. డి.సరిత కళాశాలల అనుసంధానం పాఠశాలల మ్యాపింగ్, శిక్షణ ప్రణాళికలను సమన్వయం చేస్తున్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఈ కార్యక్రమ బాధ్యతలను సుష్మిత పర్యవేక్షిస్తున్నారు. జేఎన్‌టీయు రిజిస్ట్రార్ ప్రొ. వెంకటేశ్వరరావు, కామాక్షి ప్రసాద్, మంగు తదితరులు శిక్షణా ప్రక్రియలో మార్గనిర్ధేశం చేస్తున్నారు. ఫైజామ్ ఫౌండేషన్ దీనికి సాంకేతిక భాగస్వామిగా వ్యవహరిస్తూ, ఫౌండేషన్ సహ వ్యవస్థాపకురాలు ప్రాంజలి, ట్రైనర్ వైశాక్ తెలంగాణా కోడ్ మిత్ర ఆన్ బోర్డింగ్ బాధ్యతలను చూస్తున్నారు. ఈ కార్యక్రమ పర్యవేక్షణ తెలంగాణా కోడ్ మిత్ర ఫ్లాట్ ఫారమ్ ద్వారా డిజిటల్ పద్ధతిలో సాగనుంది. నోడల్ ఫ్యాకల్టీ, ఇంటర్న్ల నమోదు, పాఠశాలల మ్యాపింగ్ హాజరు, ఇంటర్న్‌షిప్ ట్రాకింగ్, ప్రగతి నివేదికలన్నీ ఈ డిజిటల్ వేదిక ద్వారానే నియంత్రిచనున్నారు. జూన్ 15 నుంచి 20 వరకు మాస్టర్ ట్రైనర్ల ద్వారా నోడల్ ఫ్యాకల్టీకి శిక్షణ ఇస్తారు.

అనంతరం 21 నుంచి 25 వరకు కళాశాల స్థాయిలో ఇంటర్న్ల శిక్షణ ఇవ్వనున్నారు. జూన్ 30 నాటికి పాఠశాలల మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేసి జులై 1 నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో ఇంటర్న్‌షిప్‌ను అధికారికంగా ప్రారంభిస్తారు. ఇందులో భాగంగా కేవలం పాఠాలు చెప్పడమే కాకుండా ఏఐ పై అవగాహన, డిజిటల్ లిటరసీ, కంప్యూటేషనల్ థింకింగ్, కోడింగ్, ప్రాథమిక అంశాలు నేర్పిస్తారు. యువతకు సాధికారిత భవిష్యత్ తెలంగాణా నిర్మాణం అను నినాదంతో ప్రభుత్వం ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని చేపట్టిందని డా. డి.సరిత తెలియజేసారు.



మాట్లాడుతున్న సారంగపాని

## ఎస్ఐఆర్ సర్వేలో అప్రమత్తంగా ఉండాలి

### బిజెపి జిల్లా ప్రధానకార్యదర్శి మేకల సారంగపాణి

**అడ్డగుట్ట, జూన్ 14 ప్రభాతవార్త:** కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్.ఐ. ఆర్.సర్వేలో బిజెపి నాయకులు,కార్యకర్తలు భాగస్వాములై 18 సంవత్సరాలు దాటి ఉన్న ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించే విధంగా చూడాలని సికింద్రాబాద్ అసెంబ్లీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి పిలుపునిచ్చారు. ఆదివారం అడ్డగుట్టలో నిర్వహించిన బిజెపి కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిదిగా హాజరై ప్రసంగించారు. దొంగ ఓట్లను,మరణించిన వారి పేర్లను,బదిలీ అయిన ఓట్ల పేర్లను గుర్తించి వాటిని రద్దు చేయించాలన్నారు. ఎన్నికల ఎస్ఐఆర్ సర్వే, ఎన్నికల అధికారులతో నిత్యం మమేకమై వారికి సహాయ సహకారాలు అందించాలన్నారు. అడ్డగుట్ట డివిజన్ బిజెపి అధ్యక్షురాలు గాజుల సౌందర్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బిజెపి టీచర్స్ సెల్ కన్వీనర్ కొంజర్ల శ్రీనివాస్,సీనియర్ నేతలు టోపీ శంకర్,హంసరాజ్, గెల్లు ఉదయ్ యాదవ్, గంబీరావ్ పేట్ సాయన్న, శివాజీ,శ్వేత, కళావతి, విజయ్, శ్రీనివాస్,సాయి తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన లబ్ధిదారులకు డబల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలి



మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషనర్‌సభ్యులు నర్సింగ్‌రావు

**అత్తాపూర్ జూన్ 14, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు డబల్ బెడ్ రూమ్ ఇండ్లు, పింఛన్లు ఇవ్వాలని రాష్ట్ర కంట్రోల్ కమిషనర్ సభ్యులు పుస్తకాలు నర్సింగ్‌రావు మండల కార్యదర్శి కన్యగారి నర్సింహారెడ్డి పేర్కొన్నారు. సిపిఐ పార్టీ రాజేంద్రనగర్ మండలంలోని ఎర్రబోడ శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలని, పెన్షన్లు ఇవ్వాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతరం కమ్యూనిస్టు పార్టీ పోరాటం చేయాలని పేర్కొన్నారు. కాలనీలలో నెలకొన్నటువంటి సమస్యలపై నిరంతరము స్పందించి అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని వారు నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలిప్ ఎర్రబోడ శాఖ కార్యదర్శి సహాయ కార్యదర్శిలు శాఖ నాయకులు కార్యాలయం కార్యదర్శి జి సత్యం తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఎస్ఐఆర్‌పై ముఖ్య నాయకుల సమావేశం

**కార్వాన్, జూన్ 14 (ప్రభాతవార్త) :** భారత ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి, ఓటరు జాబితాను పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించడానికి కేంద్ర ఎన్నికల సంఘం ఈ నెల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌ని ప్రారంభించనున్న సందర్భంగా కార్వాన్ నియోజకవర్గంలో ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు, బాధ్యతగల వ్యక్తులతో నేడు మెహిదీపట్నంలోని జి.పుల్లారెడ్డి కాలేజీలో సాయంత్రం 6 గంటలకు నిర్వహించబడుతుందని కార్వాన్ అసెంబ్లీ బిఎల్ఏ 1 పడాల అనంత కృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఎల్ఏ2లు, శక్తి కేంద్ర ఇన్‌చార్జ్‌లు, శక్తి కేంద్ర ప్రభారీలు, బీజేపీ సీనియర్ నాయకులు, వివిధ మోర్చాల నాయకులు, బస్తీ పెద్దలు, వివిధ క్షేత్రాల ప్రముఖులు హాజరు కావాలని పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా పడాల అనంతకృష్ణ మాట్లాడుతూ.. దేశ భద్రత, ప్రజాస్వామ్య పరిరక్షణ, భారతదేశ భవిష్యత్తు కోసం ప్రజాస్వామ్యానికి పునాదికి బలమైన ఓటరు జాబితా అని, 20 ఏళ్లకు ఒకసారి నిర్వహించబడుతున్న ఈ చరిత్రాత్మక ప్రక్రియలో ప్రతి బాధ్యతగల పౌరుడు మహత్తర కార్యక్రమంలో భాగస్వామి కావాలని కోరారు.

## ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని పరిరక్షించాలి

### బిఆర్ఎస్ అధికార ప్రతినిధి మన్నెక్రిషాంక్

**కంటోన్మెంట్, జూన్ 14 ప్రభాతవార్త:** తిరుమలగిరి మండల పరిధిలోని బోయిన్‌పల్లి మార్కెట్ పక్కన ఉన్న రూ.800 కోట్ల రూపాయల విలువ చేసే 8 ఎకరాల ప్రభుత్వ ఖాళీ స్థలం ఆక్రమణకు గురైందని, ఆ స్థలంపై విచారణ జరిపి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని బిఆర్ఎస్ అధికార ప్రతినిధి, సోషల్ మీడియా కన్వీనర్ మన్నెక్రిషాంక్ ఆదివారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ హైదరాబాద్,రంగారెడ్డి జిల్లాల సరిహద్దుల్లో ఉన్న తిరుమలగిరి మండల పరిధిలోని చిన్నతోకట్ట సర్వే నెం 157బై 1, బాలనగర్ మండలం అస్మత్ పేట్‌లోని సర్వే నెం 57లలో ఉన్న 8 ఎకరాల ప్రభుత్వ ఖాళీ స్థలంలో 6 వేల ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ 10 నెలల క్రితం రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ దృష్టికి తెచ్చారు. 10 నెలల వ్యవధిలోనే ఆ స్థలం నప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి ఎలా వెళ్లిందని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా సిఎం రేవంత్ రెడ్డి స్పందించి 800 కోట్ల రూపాయల అత్యంత ఖరీదైన 8 ఎకరాల ప్రభుత్వ ఖాళీ స్థలాన్నీ ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని సిఎం రేవంత్ రెడ్డికి, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ పార్టీ ఎంపీ రాహుల్ గాంధీ, తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షులు ముఖేశ్ కుమార్ గౌడ్‌లకు వినతిపత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు.

## అడ్డగుట్టలో దోబిఘాట్‌ను ఏర్పాటు చేయాలి

**కంటోన్మెంట్,జూన్ 14 ప్రభాతవార్త:** దక్షిణ భారత దేశంలో అతి పెద్ద మురికివాడగా పేరొందని అడ్డగుట్టలో రజక వృత్తిదారులకు మెకనైజిడ్ మెడ్రన్ దోబిఘాట్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వ స్థలం కెటాయించాలని అడ్డగుట్ట రజక వృత్తిదారుల అధ్యక్షుడునర్సింగ్ రావ్,కె.స్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాల్‌ను డిమాండ్ చేశారు. ఆదివారం అడ్డగుట్టలో ఏర్పాటు చేసిన రజక వృత్తిదారుల సమావేశంలో వారు పాల్గొని రజకులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారానికి కృషిచేయాలన్నారు.కార్యక్రమంలో నాయకులు సంఘం సభ్యులు కె.మల్లేశ్, నర్సింగ్‌రావ్, విజయ్, ముత్యాలు, కర్ణాకర్, శేఖర్, మహేష్, క్రిష్ణ,వినోద్ పాల్గొన్నారు.

## సుందరయ్య పార్క్‌లో రక్తదాన శిబిరం

**చిక్కడపల్లి , జూన్ 14 ( ప్రభాతవార్త ):** ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా, వాకర్స్ క్లబ్ అఫ్ హైదరాబాద్ సెంట్రల్ , వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్301, ఏరియా3, ఆర్‌సీ9 సహకారంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరాన్ని వాకర్స్ క్లబ్ అఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షులు ఎస్. మనోహర్ రెడ్డి ప్రారంభించి ప్రసంగించారు. ఐన్ ఆయన స్వయంగా రక్తదానం చేసి సభ్యులకు ఆదర్శంగా నిలిచారు. ఆయన స్ఫూర్తితో పలువురు వాకర్స్ సభ్యులు, స్వచ్ఛంద రక్తదాతలు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. "రక్తదానం మహాదానం ప్రతి రక్తపు బొట్టు ఒక ప్రాణాన్ని కాపాడగలదు" అనే నినాదంతో సాగిన ఈ కార్యక్రమం ఎంతోమందికి స్ఫూర్తినిచ్చింది. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్301 గవర్నర్ డాక్టర్ బి. గంగాధర్ రెడ్డి, పాస్ట్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ నాగభూషణం, డీజీఈ శైలజా మోహన్, పాస్ట్ ఏవీపీ సంపత్ రెడ్డి, కుమారస్వామి, వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ మాజీ అధ్యక్షులు ఎస్. సురేందర్ రెడ్డి, ఎ. శ్రీనివాస్ రెడ్డి, ఎస్. రమేష్ రెడ్డి, ఆర్. వివేకానంద్, పి.వి. నిరంజన్ రెడ్డి, క్లబ్ ఉపాధ్యక్షులు కల్యాణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. శిబిరాన్ని విజయవంతం చేసిన రక్తదాతలకు, వైద్య బృందానికి, స్వచ్ఛంద సేవకులకు అధ్యక్షులు ఎస్. మనోహర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

# క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తాం

**శామీర్‌పేట, జూన్ 14, (ప్రభాతవార్త):** యువత క్రికెట్ పోటీల్లో జాతీయ స్థాయికి ఎదగాలని, క్రీడాకారులుగా రాణిస్తున్న వారికి తమ పూర్తి సహకారం ఉంటుందని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం శామీర్‌పేట మండలంలోని అలియాబాద్ (మున్సిపాల్టీ) కేంద్రంలోని క్రికెట్ గ్రౌండ్‌లో క్రికెట్ పోటీలు ముగింపు కార్యక్రమం జరిగింది. అలియాబాద్ మున్సిపల్ చైర్మన్ కె.శిరీష్కప్పారెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ పరిధిలోని ఆరు గ్రామాల వారికి మూడు రోజుల పాటు 30టీమ్‌లకు క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఆదివారం రాత్రి క్రికెట్ పోటీల విజేతలకు కప్‌లు, నగదు బహుమతులు ప్రదానం జరిగింది. ఈ క్రికెట్ పోటీల్లో విన్నర్‌గా తుర్కపల్లి టీమ్ రాణించగా, రన్నర్‌గా యాదారం టీమ్ రాణించినట్లు నిర్వాహకులు తెలిపారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్, అలియాబాద్ మున్సిపల్ చైర్మన్ కె.శిరీష్కప్పారెడ్డిలతో పాటు మరి కొందరు పాల్గొని విన్నర్‌గా గెలుపొందిన తుర్కపల్లి టీమ్ సభ్యులను అభినందించి విన్నర్ కప్‌ను అందజేశారు. అదే విధంగా రన్నర్‌గా నిలిచిన యాదారం టీమ్ సభ్యులను అభినందించి కప్‌ను అందజేశారు. విన్నర్ టీమ్‌కు నగదు బహుమతిగా 20వేల రూపాయలు, రన్నర్ టీమ్‌కు 10వేల రూపాయల నగదు బహుమతులను కూడా వారి విజేతలకు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన ముగింపు బహుమతుల ప్రధానం కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్ మాట్లాడుతూ మున్సిపల్ స్థాయిలో క్రికెట్ పోటీల్లో రాణించిన వారు, జిల్లా స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో, జాతీయ స్థాయిలో రాణించేలా కృషి చేయాలని యువతకు క్రీడాకారులకు సూచించారు. యువతలో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయటానికి క్రీడలు దోహదపడుతాయన్నారు. యువతకు క్రికెట్ పోటీలు నిర్వహించి ప్రోత్సహించిన మున్సిపల్ చైర్మన్ కె.శిరీష్కప్పారెడ్డిని ఆయన అభినందించారు. గ్రామీణ ప్రాంతంలో యువకులు క్రికెట్ పోటీల్లో రాణిస్తున్న వారికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని నక్క ప్రభాకర్‌గౌడ్ పేర్కొన్నారు. ముగింపు ఫైనల్ టీమ్స్ క్రికెట్ పోటీలు రసవత్తరంగా జరిగినప్పటికీ, గెలుపు ఓటములు సహజమని, విన్నర్ వారు సంతోషంగా ఉండటం, రన్నర్‌గా కొంత నిరుత్సాహంగా ఉండటం సహజమని, నిరుత్సాహ పడకుండ ముందుకు సాగాలని, ఈ క్రికెట్ పోటీలు మనోధైర్యాన్ని ఇస్తాయని, పోటీ తత్వాన్ని పెంచుతాయని అన్నారు. అలియాబాద్ మున్సిపల్ చైర్మన్ కె.శిరీష్కప్పారెడ్డి మాట్లాడుతూ క్రికెట్ పోటీల్లో రాణించి విజయం సాధించి ఫైనల్‌లో విన్నర్, రన్నర్‌గా వచ్చిన టీమ్‌లను ఆమె అభినందించారు. యువతకు తన పూర్తి సహకారం ఉంటుందని, పోటీల్లో పాల్గొన్న వారు నిరుత్సాహ పడకుండ భవిష్యత్‌లో నిర్వహించబోయే పోటీల్లో పాల్గొనాలని, క్రీడల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.మహిపాల్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేష్, అలియాబాద్ మున్సిపల్ వైస్‌చైర్మన్ కె.మాలతీమాదవరెడ్డి, కౌన్సిలర్లు ముద్దం సుదాకర్‌రెడ్డి, ఎస్.జశ్వంత్‌రెడ్డి, గూడె వెంకటేశ్, నాయకులు కంటం కృష్ణా రెడ్డి, సాయికృష్ణ, బాబు, రాంప్రసాద్, రాఘవరెడ్డి, సాయికుమార్, నాగమ భ్రారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణ, ఎన్ఎస్‌యుఐ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి టి.రాము, జిల్లా కాంగ్రెస్ నాయకులు బొమ్మక్ శ్రీనివాస్, పలువురు యువకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు ప్రభాకర్‌గౌడ్ పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ కె.శిరీష్కప్పారెడ్డి

**సేవా భారతి ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ**

**శామీర్‌పేట, జూన్ 14, (ప్రభాతవార్త):** జగ్గంగూడ గ్రామంలోని మున్సిపల్ వార్డు కార్యాలయంలో సేవా భారతి ఆధ్వర్యంలో ఉచితంగా 21మందికి కంప్యూటర్‌లో శిక్షణ ఇవ్వటం జరిగింది. ఆదివారం మూడుచింతలపల్లి మండలంలోని జగ్గంగూడలోని మున్సిపల్ వార్డు కార్యాలయం వద్ద సేవా భారతి వారి ఆధ్వర్యంలో కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసుకున్న 21మందికి స్థానిక కౌన్సిలర్లు స్వప్నరవీందర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, జంగారెడ్డిలు పాల్గొని విద్యార్థులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. సేవా భారతి సభ్యులు కోరుతూ యువత సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని వారు సూచించారు. ఉచితంగా కంప్యూటర్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించి శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించటం అభినందనీయమని, ప్రశంసనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సేవా భారతి సభ్యులు, ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## పనికి వెళ్లిన భర్త అదృశ్యమయ్యాడని ఫిర్యాదు

**రంగారెడ్డి అర్బన్ జూన్ 14, (ప్రభాతవార్త):** పనికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరిన భర్త నాలుగు రోజులుగా కనిపించకపోవడంతో భార్య శంషాబాద్ రూరల్ పోలీసులను ఆశ్రయించింది. సీఐ నరేందర్ రెడ్డి వివరాల ప్రకారం శంషాబాద్ మండలం పరిధిలోని కవ్వగూడ గ్రామానికి చెందిన మాధవ్ గత రెండు సంవత్సరాలుగా తన కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. ఈ నెల 11వ తేదీ ఉదయం 7 గంటలకు మేస్త్రీ పనికి వెళ్తున్నానని చెప్పి టీ ఎస్ 13ఈ ఎఫ్ 5796 నంబర్ గల మోటార్‌సైకిల్‌పై ఇంటి నుంచి బయలుదేరాడు. అయితే అప్పటి నుంచి ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు, బంధువులు మరియు పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా గాలించినప్పటికీ అతని ఆచూకీ లభించలేదు. భర్త తిరిగి వస్తాడని ఆశించిన భార్య లక్ష్మి వేచి చూసిన అనంతరం శంషాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సన్నిధానంలో అయ్యప్ప పూజలు కొనసాగించండి

**ఘట్‌కేసర్, జూన్ 14, (ప్రభాతవార్త):** ప్రస్తుత పరిస్థితులను అనుగుణంగా సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవాలని శ్రీధర్మశాస్త సేవాసమితి వ్యవస్థాపకులు బర్ల అంజనేయులు అన్నారు. ఘట్‌కేసర్ డివిజన్ శివారెడ్డిగూడలోని శ్రీదండగడ్డ ప్రసన్న వీరాంజనేయస్వామి దేవాలయ ఆవరణలో ఆదివారం శ్రీధర్మశాస్త సేవా సమితి సన్నిధానం స్వాముల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా శ్రీధర్మశాస్త సేవా సమితి వ్యవస్థాపకులు బర్ల అంజనేయులు హాజరై మాట్లాడారు. ఈసందర్భంగా మెజారిటీ సభ్యుల హాజరైపలు అంశాలపై చర్చించి ఏకగ్రీవంగా తీర్మానాలు చేశారు. ప్రస్తుతం ఉన్న కార్యనిర్వాహక కమిటీని తాత్కాలికంగా నిలిపివేయాలని సన్నిధానంలో గతంలో జరిగిన విధంగానే అయ్యప్ప స్వామి పూజలు కొనసాగించాలని తీర్మానం చేశారు. మన సంస్కృతి, సాంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందని ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈసమావేశంలో బండారి జగదీష్‌రెడ్డి, శంకర్, గుండ్ల రామశర్మ, హరినాథ్, లక్ష్మణ్, ఎల్లయ్య, నరేశ్‌గౌడ్, మహేందర్, కృష్ణగౌడ్, శ్రావణ్‌కుమార్, రాజు, శివదీపక్, బాలకృష్ణ, రవికాంత్, శ్రీనివాస్, గురునాథ్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే
# ఆందోళన ఉధృతం

**ఘట్‌కేసర్, జూన్ 14, ప్రభాతవార్త:** కార్మికుల సమస్యలు పరిష్కారం కావాలంటే ఐక్య పోరాటమే ఏకైక మార్గమని తెలంగాణ మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.రవిచంద్రన్ అన్నారు. ఘట్‌కేసర్ మహిళా భవనంలో ఎంఎంసి ఘట్‌కేసర్ సర్కిల్ కార్మికుల సదస్సు జరిగింది. కార్మిక నాయకులు ఎం.రాంచందర్ అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో రవిచంద్రన్ మాట్లాడుతూ మున్సిపాలిటీల నుంచి జిహెచ్ఎంసిలో విలీనమైన కార్మికులను రెగ్యులర్ చేసి కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పదవీ విరమణ పొందిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు వారసత్వ ఉద్యోగాలు కల్పించాలని విధుల్లో మరణించిన, అనారోగ్యానికి గురైన కార్మికుల కుటుంబాలకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. జనాభాకు అనుగుణంగా సిబ్బందిని పెంచాలని కొన్ని సర్కిళ్లలో వాటర్‌మెన్, ఎలక్ట్రిషియన్లు, పారిశుద్య కార్మికుల వేతనాల్లో కోతలు విధించడం అన్యాయమని, కార్మికుల హాజరు పట్టికలను పూర్తిగా పరిశీలించి వారికి రావాల్సిన పూర్తి వేతనాలను ఖాతాలో జమచేయాలని డిమాండ్ చేశారు. పండుగ సెలవులు, క్యాజువల్ లీవులు అమలు చేయాలని కోరారు. మున్సిపల్ సంఘం కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఈనెల 23, 24 తేదీలలో రంగారెడ్డి జిల్లా కాటేదాన్‌లో తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ 4వ మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాసభల్లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ పోరాట కార్యాచరణ రూపొందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఏఐటీయూసి నాయకులు కల్లూరి జయచంద్ర, ఘట్‌కేసర్ మండల సీపీఐ కార్యదర్శి లొట్టి ఈశ్వర్, మున్సిపల్ రాష్ట్ర నాయకులు మద్దిలేటి, ఘట్‌కేసర్ సర్కిల్ అధ్యక్షురాలు సువర్ణ, శ్రీరాములు, దాసు, అశోక్, అరుణ, ఎస్.లక్ష్మి, రామ్‌కుమార్, రాజు, భారతమ్మ, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న మున్సిపల్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రవిచంద్రన్

## గోవిందాపూర్‌లో అంబేద్కర్ విగ్రహావిష్కరణ

**మోమిన్‌పేట్, జూన్ 14. ప్రభాతవార్త:** మోమిన్‌పేట్ మండల పరిధిలోని గోవిందాపూర్ గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ నూతన విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వికారాబాద్ అసెంబ్లీ కో-ఆర్డినేటర్ వడ్ల నందు హాజరై స్థానిక సర్పంచ్ కృష్ణవేణి గోవింద్ అధ్యక్షతన నూనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ దేశాలలోకెల్ల మన దేశంలో ప్రతి ఒక్కరికి స్వేఛ్ఛా, సమానత్వం, చట్టపరమైన హక్కులు, సమానత్వం, సామాజిక న్యాయం, విధ్యాభివృద్ధి కల్పించిన వహాను బావుడు డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ ఒక్కరేనని కొనియాడారు. అంబేద్కర్ కృషి తరతరాలకు ఆధర్శం, ఆయన సేవలు తరతరాలకు చిరస్మరణీయమని పేర్కొన్నారు. కనుక నేడు భారదేశ ప్రతి పౌరుడు, యువకులు ఆయన ఆశయాలను అనుసరిస్తూ సమాజాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మోమిన్‌పేట్ మండల బీజేపి పార్టీ అధ్యక్షులు ఆశిరెడ్డి, అంబేద్కర్ ప్రజా సంఘం రాష్ట్ర అధ్యక్షులు కట్టెల మల్లేశం, మల్లారెడ్డిగూడెం సర్పంచ్ తనయుడు విక్రంరెడ్డి, పలు గ్రామాల ప్రజాప్రతినిధులు, బీజేపి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



అంబేద్కర్‌కు నివాళులు అర్పించి ప్రమాణం చేస్తున్న శ్రీకాంత్

## రాజ్యాంగంతోనే సమన్యాయం: శ్రీకాంత్

**ఘట్‌కేసర్, జూన్ 14, ప్రభాతవార్త:** అంబేద్కర్ రాజ్యాంగం రాయకుంటే భారతదేశం చాతుర్వర్ణ వ్యవస్థతో మతోన్మాధంతో కులవ్యవస్థతో ఇంకో 5000 సంవత్సరాలు వెనక్కు పోయేదని మర్రిపల్లిగూడ అరుంధతి యువజన సంఘం అధ్యక్షులు చిలుగూరి శ్రీకాంత్ అన్నారు. ఘట్‌కేసర్‌లో ఆదివారం ప్రబుద్ధభారత్ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని ప్రజలలోకి తీసుకువెళ్లడానికి 270వ వారం నిత్యపూలమాళ కార్యక్రమం నిర్వహించారు. అరుంధతి యువజన సంఘం అధ్యక్షులు చిలుగూరి శ్రీకాంత్, ఉపాధ్యక్షులు చిలుగూరి నిఖిల్, కార్యదర్శి ఈదుగళ్ల అశోక్‌లు విచ్చేసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాళ వేసి నివాళులు అర్పించారు. పిబిఐ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా సమన్వయకర్త ఎం.అరుణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు పాల్గొని అంబేద్కర్ సేవలను కొనియాడారు. అనంతరం సంత్ కబీర్‌దాస్ 628వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాళ వేసి నివాళులు అర్పించారు. కబీర్‌దాస్ జయంతి సందర్భంగా అరుణ్‌కుమార్ ఆయన జీవిత చరిత్రను తెలియజేశారు. అనంతరం అందరూ భారత రాజ్యాంగ పీఠికపై ప్రమాణం చేశారు. ఉన్నతమైన ఆదర్శం కల్గిఉండటం దాని కోసం సహనంతో పరిశ్రమించడం మనజీవిత సూత్రంగా ఉండాలని అంబేద్కర్ మాటలను గుర్తుచేస్తూ శివకృష్ణ సూక్తిగా చెప్పారు. ఈకార్యక్రమంలో నాయకులు బండారు రాందాస్, కట్కూరి నర్సింగ్‌రావు, నర్సింగ్‌రావు, సి.వంశీ, సి.ఆనంద్, యెల్లేశ్, సి.నిఖిల్, ఇ.విష్ణు, ప్రవీణ్, జె.అఖిల్, శివకృష్ణ, శివ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.




సభలో ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ జి.హరగోపాల్

## సంక్షోభంలో మానవహక్కులు, న్యాయవ్యవస్థ
### ప్రొఫెసర్ హరగోపాల్

**సైఫాబాద్, జూన్ 14 ప్రభాతవార్త :** దేశంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్ సందర్భంగా మానవ హక్కులు, రాజ్యాంగం, న్యాయ వ్యవస్థ సంక్షోభంలో కూరుకుపోయిందని హక్కుల నేత ప్రొఫెసర్ జి.హరగోపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆపరేషన్ కగార్ వల్ల దేశంలో భయంకరమైన పరిస్థితులు ఏర్పడ్డాయని, దీంతో తాము ఢిల్లీలో కొంత మంది విద్యార్థులతో కలిసి శాంతి చర్చలు కోసం ప్రయత్నిస్తే తమను అర్బన్ నక్సలైట్లగా ముద్రవేశారని, విద్యార్థులను చాలా ఇబ్బందులకు గురిచేశారని ఆయన ఆరోపించారు. భారత ప్రజా న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన ప్రజా నివేదన సభలో ఆయన ప్రసంగించారు. ఎన్‌కౌంటర్లపై సుప్రీం కోర్టుకు వెళ్ళినా పట్టించుకోలేదన్నారు. అధికారంలో ఉన్న పార్టీ రాజ్యాంగాన్ని తిరస్కరిస్తున్నదని, అసలు రాజ్యాంగాన్ని పట్టించుకోవడం లేదని, దీంతో ప్రజలకు ఏమి చేయాలో అర్థం కావడం లేదని ఇప్పటికైనా ప్రజలు న్యాయ వ్యవస్థను కాపాడుకోవాలని, న్యాయమూర్తులు న్యాయంగా, చట్టబద్దంగా తీర్పులు ఇవ్వాలని ఆయన కోరారు. ప్రజలకు న్యాయవ్యవస్థపై విశ్వాసం పోతున్నదని, దీంతో అరాచక వ్యవస్థ వచ్చేప్రమాదం ఉందన్నారు. రాజ్యం చట్టానికి వ్యతిరేకంగా ఒక వ్యక్తి ప్రాణం తీయడానికి వీలు లేదని, కాని ఆపరేషన్ కగార్ పేరుతో అనేక ఘోరాలు జరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆపరేషన్ కగార్ అమలు జరుతున్న సమయంలో తెలంగాణ రాష్ట్రంలో హింస జరగలేదన్నారు. ఆపరేషన్ కగార్ వల్ల అనేక మంది ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారని, వారి కుటుంబాలకు తీరని అన్యాయాలు జరిగాయని, చరిత్రలో వారి పేర్లు చిరస్థాయిగా ఉంటాయని హరగోపాల్ చెప్పారు. ఈ సభలో ప్రముఖ పాత్రికేయులు ఎన్.వేణుగోపాల్, సంఘం జాతీయ కార్యదర్శి సురేష్‌కుమార్, న్యాయవాదులు రమేష్, రజిత, జావాద్, పద్మ పాల్గొన్నారు.

## సమస్యలపై రావుల శ్రీధర్‌రెడ్డి పాదయాత్ర

**యూసుఫ్‌గూడ, జూన్ 14, ప్రభాతవార్త :**

జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహమత్ నగర్ డివిజన్‌లో బీఆర్ఎస్ నేత, మాజీ కార్పొరేషన్ చైర్మన్ రావుల శ్రీధర్ రెడ్డి ఆదివారం పర్యటించారు. స్థానిక బీఆర్ఎస్ నేతలతో కలిసి కార్మిక నగర్ డివిజన్ నుండి ప్రతిభానగర్ వరకు పాదయాత్ర నిర్వహించారు. స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. రహమత్‌నగర్‌లో రహదారుల పరిస్థితి దారుణంగా మారడంతోపాటు, పైప్ లైన్ కోసం జలమండలి తవ్విన రోడ్లు అలానే వదిలివేయాన్ని పరిశీలించిన ఆయన ప్రభుత్వ నిర్లక్ష్యవైఖరికి నిదర్శనమన్నారు. మూడు నెలలుగా జలమండలి అధికారులకు ప్రజలు ఫిర్యాదు చేసినా ఇంతవరకు పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వానికి పేదలు, మధ్యతరగతి ప్రజలు అంటే చిత్తశుద్ధి లేదని, ముఖ్యమంత్రి ఉండే జూబ్లీహిల్స్ ప్రాంతంలో ఇలానే ఉందా అంటూ ప్రశ్నించారు. హైదరాబాద్ ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ ఏం చేస్తున్నారంటూ ప్రశ్నించారు. వారం రోజుల్లో కార్మిక నగర్, ప్రతిభా నగర్ రహదారులు పూర్తి చేయకపోతే జలమండలి కార్యాలయాన్ని ముట్టడిస్తామని, మంత్రులను అడ్డుకుంటామని అన్నారు.

ఎన్నికల సమయంలో అనేక హామీలిచ్చి ఇప్పుడు నిరక్ష్యం వహిస్తున్నారన్నారు. తాగునీటి సమస్య ఉందని, మురికి నీళ్ళు డ్రైనైజ్ నీళ్ళు వాటర్ పైప్‌లో కలిసి కలుషిత నీరు సరఫరా అవుతుందని ప్రజలు మొత్తుకుంటున్నా వినిపించుకోవడం లేదన్నారు. ప్రజల కోసం బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కమఠం నరసింహా రెడ్డి, జయంత్, ఘనీ, గడ్డం శ్రీధర్, లింగరాజ్, కృష్ణ, విజయ్ సింగ్, రొంపి బాలకృష్ణ, మొహ్సిన్, మోయిజ్, నరసింహ, కురుమూర్తి, ప్రభాకర్, గణేష్, అల్తాఫ్, అశోక్, ఖాజా పాల్గొన్నారు.



బీరువా తాళాలు పగలగొట్టి చిందర వందరగా పడి ఉన్న వస్తువులు

## 11 తులాల బంగారం, రెండు కిలోల వెండి, నగదు చోరీ

**ఎల్.బి.నగర్, జూన్ 14 ప్రభాతవార్త:** ఇంటి తాళాలు పగలగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. ఈ సంఘటనలో బంగారం, వెండి, నగదును దొంగలు దోచుకెళ్ళారు. ఈ సంఘటన చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్స్పెక్టర్ సైదులు తెలిపిన వివరాల ప్రకారం... కొత్తపేట డివిజన్ మోహన్ నగర్‌లో నివాసం ఉండే పాలెం అశోక్‌కుమార్‌డ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 9వ తేదీన వారి సొంత గ్రామం నెల్లూరు జిల్లా అనంతసాగరం మండలం అగ్రహారం గ్రామానికి వెళ్ళాడు. ఈనెల 13వ తేదీన సాయంత్రం 6 గంటలకు తిరిగి మోహన్‌నగర్‌కు రాగా ఇంటి మెయిన్‌డోర్ తాళాలు పగలగొట్టి ఉన్నాయి. లోపటికి వెళ్లి చూడగా బీరువా తాళాలు కూడా పగలగొట్టి అందులోని 11 తులాల బంగారు ఆభరణాలు, రెండు కిలోల వెండి వస్తువులు, రూ.50 లక్షల నగదును దొచుకెళ్ళారు. తన ఇంట్లో దింగతనం జరిగిన విషయాన్ని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కెమెరాకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

## గంజాయి తాగి యువకుల హల్చల్

**ఎల్.బి.నగర్, జూన్ 14 ప్రభాతవార్త:** గంజాయితాగి మత్తులో యువకులు హల్చల్ చేశారు. ఈ సంఘటన చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు బాధితులు తెలిపిన వివరాల ప్రకారం...కొత్తపేట డివిజన్ న్యూనాగోల్‌లో శనివారం రాత్రి కొంతమంది యువకులు గంజాయి సేవించి హల్చల్ చేశారు. ప్రతిరోజు రాత్రిపూట గంజాయి మత్తులో ఉన్న యువకులు కాలనీ నుంచి వెళ్తున్న వారి పట్ల గురుసుగా వ్యవహరిస్తున్నారు. అదే క్రమంలో శనివారం రాత్రి కూడా గంజాయి మత్తులో ఉన్న ఇద్దరు యువకులు స్థానికులతో గొడవపడ్డారు. దీంతో బాధితులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఈ విషయమై విచారణ ప్రారంభించారు. అయితే బాధితులు పోలీసులకు సమాచారం అందించడంతో మత్తులో ఉన్న యువకులు పరారయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని త్వరలోనే వారిని పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

## మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్లిన దుండగులు

**ఎల్.బి.నగర్, జూన్ 14 ప్రభాతవార్త:** ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును గుర్తుతెలియని దుండగుడు లాక్కెళ్ళాడు. ఈ సంఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నాగోల్ ఇన్స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ తెలిపిన వివరాల ప్రకారం.. సాయినగర్‌కాలనీ రోడ్‌నంబర్-2లో నివాసముంటున్న పాశం శ్యామల(65) శుక్రవారం ఇంట్లో నిద్రిస్తుండగా తెల్లవారు జామున 4 గంటల సమయంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న ఆమె ఇంటి తలుపు తట్టాడు. నిద్రమత్తులో ఉన్న శ్యామల తలుపు తెరవగానే ఆ వ్యక్తి ఆమె మెడలో ఉన్న 3 తులాల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యాడు. భర్త మృతి చెందడంతో శ్యామల కింద అంతస్తులో ఒంటరిగా నివసిస్తుండగా, ఆమె కుమారుడుపై అంతస్తులో ఉంటున్నట్లు పోలీసులు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ రుద్వీర్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారు.

## కరెంట్ బిల్లు పేరుతో మహిళకు రూ.1.21 లక్షల టోకరా

**జూబ్లీహిల్స్, జూన్ 14, ప్రభాతవార్త :** కరెంట్ బిల్లు బకాయి ఉందని నమ్మించి సైబర్ నేరగాళ్లు ఓ మహిళ నుంచి రూ.1.21 లక్షలు కాజేశారు. ఖైరతాబాద్ పోలీసుల కథనం ప్రకారం.. ఖైరతాబాద్‌కు చెందిన ప్రైవేటు ఉద్యోగి విద్యా అనూషా గర్రేకు గుర్తుతెలియని వ్యక్తి నుంచి విద్యుత్ బిల్లు చెల్లించకపోతే కనెక్షన్ నిలిపివేస్తామని సందేశం వచ్చింది. అగంతకుడి మాటలు నమ్మి బిల్లు చెల్లించేందుకు పంపిన ఏపీకే ఫైల్‌ను ఆమె మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేయడంతో క్రెడిట్ కార్డు వివరాలు నేరగాళ్ల చేతికి చేరాయి. అనంతరం ఆమె అనుమతి లేకుండానే మూడు లావాదేవీల ద్వారా రూ.1.21 లక్షలు కాజేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఖైరతాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఎదులాబాద్‌లో విశ్వశాంతియాగం నిర్వహిస్తున్న దృశ్యం

## వైభవంగా విశ్వశాంతియాగం

**ఘట్‌కేసర్, జూన్ 14, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్‌లోని శ్రీభ్రమరాంబికా మల్లిఖార్జునస్వామి దేవాలయంలో శనివారం 19వ విశ్వశాంతియాగం ఘనంగా నిర్వహించారు. ఆలయ యజ్ఞ నిర్వహణకర్త కంట్లం గౌరీశంకర్ ఆధ్వర్యంలో ప్రతినెల మాసశివరాత్రి రోజున లోకకళ్యాణార్థం విశ్వశాంతియాగం నిర్వహిస్తున్నారు. మల్లిఖార్జునస్వామికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆలయ ఆవరణ లోని విష్ణువినాయక కళ్యాణ మండపంలో విశ్వశాంతి యజ్ఞం నిర్వహించారు. ఘట్‌కేసర్ మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరియాదవ్-షిని, కంట్లం గౌరీశంకర్, కంట్లం ప్రదీప్ కుమార్ దంపతులు యజ్ఞంలో పాల్గొన్నారు. అంతకు ముందు మాజీ సర్పంచ్ యాదగిరియాదవ్ ఆలయంలోని శివలింగానికి అభిషేకం చేశారు. అర్చకులు శ్యామ్‌కుమార్ మంత్రోచ్చారణాల మధ్య విశ్వశాంతిహోమం ఘనంగా జరిపారు. ప్రపంచంలో శాంతి నెలకొని ప్రజలందరూ సుభీక్షంగా ఉండాలని పరమేశ్వరున్ని వేడుకుంటూ ప్రతినెలా యగం చేస్తున్నామని గౌరీశంకర్ తెలిపారు. అనంతరం భక్తులకు పంచామృత తీర్థ ప్రసాద వితరణ చేశారు. మాజీ వార్డుసభ్యులు ఉదారి సత్యనారాయణ, ఎర్రోళ్ల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## షాద్‌నగర్‌లో యమపాశాలు

(మొదటి పేజీ తరువాయి)

వేలాడుతున్న కేబుళ్ల తెగి, విద్యుత్ వైర్లకు తగిలి మెరుపులు వస్తున్నాయి. దీంతో ఆ మార్గంలో వెళ్లే వారు కేబుళ్ల తగిలి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ తీవ్రమైన పరిస్థితులపై విద్యుత్ అదే విధంగా మున్సిపల్ శాఖలు తక్షణమే చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నిబంధనలకు విరుద్ధంగా నెట్, ప్రసార మాధ్యమాల కేబుల్స్‌లను తక్షణమే తొలగించాలి. గతంలో విద్యుత్ శాఖ అధికారులు కేబుల్స్ ను తొలగించే పని పెట్టుకుని, శ్యాంసుందర్ రెడ్డి, పట్టణ రూరల్ ఏఈల సహకారంతో కేబుల్స్ ను కొంతవరకు తొలగించారు. అయితే ఈ ప్రక్రియ నిరంతరాయంగా ముందుకు సాగకపోవడంతో, మళ్లీ యధా రాజా తథా ప్రజా అన్నట్టుగా పరిస్థితి మొదటికే వచ్చింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## ఓటర్ల జాబితా సవరణపై అవగాహన సదస్సు

**ఖైరతాబాద్, జూన్ 14, (ప్రభాతవార్త):** టీపీసీసీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమానికి సంబంధించి ఖైరతాబాద్ నియోజకవర్గ ఓటర్ల జాబితాపై బీఎల్ఏలకు అవగాహన కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం శిక్షణ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమం ఖైరతాబాద్ నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే పి. విజయరెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. సదస్సుకు ముఖ్య అతిథులుగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కార్యక్రమ ఇన్‌చార్జిగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఇర్ఫాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు బూత్ లెవల్ ఏజెంట్లకు (బీఎల్ఏలు) ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ, కొత్త ఓటర్ల నమోదు, వివరాల సవరణ, తొలగింపులు, అభ్యంతరాల దాఖలు తదితర అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పి. విజయరెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడి పేరు ఓటర్ల జాబితాలో నమోదు కావడానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. బీఎల్ఏలు పార్టీకి, ప్రజలకు మధ్య వారధిలా వ్యవహరించి క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ నియోజకవర్గానికి చెందిన బీఎల్ఏలు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై కొలన్ హన్మంత్‌రెడ్డి పాదయాత్ర

**కొంపల్లి, జూన్ 14, ప్రభాతవార్త :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప (ఆర్‌జీకే) కాలనీలో నెల కొన్న తాగునీటి సమస్యలు, చిరు వ్యాపారుల ఇబ్బందులపై కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి ఆదివారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో నేరుగా మాట్లాడిన హన్మంత్‌రెడ్డి వారి సమస్యలను తెలుసుకుని వినతిపత్రాలను స్వీకరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాలనీలో ఉన్న తాగునీటి సమస్యలు, చిరు వ్యాపారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి గణేష్, డీసీసీ అధికార ప్రతినిధి భారత్ గౌడ్, జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కావలి చంద్రయ్య, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నరేందర్ రెడ్డి, కృష్ణ గౌడ్, రషీద్, పిల్లి ఆంజనేయులు, బుచ్చిరెడ్డి, చంద్రశేఖర్, లక్ష్మణ్, శ్రీనివాస్, యువరాజ్, మహిళా నాయకులు కౌసల్య, చంద్రకళ, అనిత రెడ్డి, మాధవి రెడ్డి తదితరులతో పాటు కాలనీవాసులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా హిందూ సమ్మేళనం

**జూబ్లీహిల్స్, జూన్ 13, ప్రభాతవార్త :** హిందూ సంచలన సమితి ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని ఇందిరానగర్‌లో ఆదివారం సాయంత్రం హిందూ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. సమితి అధ్యక్షుడు కొత్త వెంకటేశ్వర్లు, కన్వీనర్ అరవింద్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అభయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బాలచందర్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు పంచ పరివర్తన నియమాలపై అవగాహన కల్పిస్తూ సామాజిక సమరసత, పర్యావరణ పరిరక్షణ, స్వావలంబన జీవనం, పౌర విధుల ఆచరణ, కుటుంబ ప్రబోధన్ వంటి అంశాల ప్రాధాన్యాన్ని వివరించారు.

# సమస్యలు తెలిపితే పరిష్కారానికి కృషి చేస్తా

**ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్**

**సంజీవరెడ్డి నగర్, జూన్ 14, ప్రభాతవార్త:** సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హామీఇచ్చారు. ఆదివారం సనత్‌నగర్‌లోని మోడల్ కాలనీలోగల పూజిత అపార్ట్‌మెంట్ వాసులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అపార్ట్‌మెంట్ వాసులు ఐక్యంగా ఉండి తమ ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. గతంలో తన దృష్టికి తీసుకొచ్చిన అనేక సమస్యలను ఇప్పటికే పరిష్కరించిన విషయాన్ని గుర్తు చేశారు. మోడల్ కాలనీలో రోడ్ల అభివృద్ధి, ఫుట్‌పాత్‌ల నిర్మాణ పనులు చేపట్టినట్లు వివరించారు. అపార్ట్‌మెంట్ వాసులు నీటి కొరతను ప్రస్తావించగా, పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రజలకు ఎప్పుడైనా, ఏ అవసరమైనా అందుబాటులో ఉంటానని తెలిపారు. సమావేశంలో బిఆర్ఎస్ సనత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు కొలన్ బాల్‌రెడ్డి, అసోసియేషన్ అధ్యక్షుడు రమణయ్య, ప్రధాన కార్యదర్శి శశిధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, బానుకిరణ్, రవి, ప్రవీణ్, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, రమేష్‌గౌడ్, భోగి బాలరాజ్, శేఖర్, పీయూష్ గుప్తా, వసీం, జమీర్, పురుషోత్తం, హరిసింగ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని

**అనిల్ కుమార్ యాదవ్ మృతికి సంతాపం...**

అనిల్ కుమార్ యాదవ్ ఆకస్మిక మృతి పట్ల మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ విచారం వ్యక్తం చేశారు. మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ బావమరిది, మాజీ కార్పొరేటర్ శ్రీదేవి సోదరుడు అయిన అనిల్ కుమార్ యాదవ్ మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదివారం అమీర్‌పేట్‌లోని మున్సిపల్ మార్కెట్ రోడ్డులో గల వారి నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్‌యాదవ్ పార్థివ దేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ప్రవీణ్ రెడ్డి, అశోక్ యాదవ్, గులాబ్ సింగ్, ప్రదీప్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఎల్ఈడి విద్యుత్ దీపాలతో సర్పంచ్ శ్రీరాములు,వార్డు సభ్యులు,

## రాత్రివేళ భద్రతకు భరోసా

**కొత్తూరు, జూన్ 14, ప్రభాతవార్త:** కొత్తూరు మండలం మక్తగూడ గ్రామపంచాయతీ పరిధిలోని అన్ని ప్రధాన వీధులు, కాలనీలు, తండాల్లో నూతన విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ బోకుల శ్రీరాములు తెలిపారు. పంచాయతీ నిధులతో ఆధునిక సాంకేతికతతో రూపొందించిన సుమారు 150 ఎల్ఈడీ విద్యుత్ దీపాలను పెద్దగుట్ట తండాతో పాటు గ్రామంలోని పలు వీధుల్లో ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ దీపాల ఏర్పాటు వల్ల రాత్రి వేళల్లో గ్రామ ప్రజలకు మెరుగైన వెలుతురు అందడంతో పాటు భద్రత కూడా పెరుగుతుందని అన్నారు. గ్రామంలోని ప్రతి వీధి ప్రకాశవంతంగా ఉండేలా చర్యలు చేపడుతున్నామని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని సర్పంచ్ శ్రీరాములు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బోకుల రాజు, దయ్యాల శ్రీను, కె. శ్రీనివాస్, ఎం. చందర్ నాయక్, జి. కిష్టయ్య, బుచ్చయ్య, అంజయ్య, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

## ఎయు విద్యార్థిని చంద్రకళకు పిహెచ్‌డీ పట్టా ప్రధానం



ఏయూలో డాక్టరేట్ సాధించిన విద్యార్థిని చంద్రకళకు పిహెచ్‌డీ పట్టాను అందజేస్తున్న యూనివర్శిటీ ప్రతినిధులు.

**ఘట్‌కేసర్ రూరల్, జూన్ 14, ప్రభాతవార్త:** అనురాగ్ యూనివర్శిటీ విద్యార్థిని ఎం. చంద్రకళ అడ్వాన్స్డ్ ఫ్రేమ్ వర్క్ ఫర్ ఆఫ్ లైన్ తెలుగు హ్యాండ్ రిటన్ క్యారెక్టర్ అండ్ వర్డ్ రికగ్నిషన్ సిస్టమ్ అనే అంశంపై డాక్టరేట్ సాధించినట్లు యూనివర్శిటీ ప్రతినిధులు తెలిపారు. పోచారం డివిజన్ వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్శిటీలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థిని ఎం. చంద్రకళ అడ్వాన్స్డ్ ఫ్రేమ్ వర్క్ ఫర్ ఆఫ్ లైన్ తెలుగు హ్యాండ్ రిటన్ క్యారెక్టర్ అండ్ వర్డ్ రికగ్నిషన్ సిస్టమ్ అనే అంశంపై డాక్టర్ సంతోశ్ మిర్యాల పర్యవేక్షణలో పరిశోధన చేసినట్లు తెలిపారు. పరీక్షకుల కమిటీ సిఫారసుల ఆధారంగా చంద్రకళ డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ ( పిహెచ్‌డీ ) పట్టా సాధించినట్లు తెలిపారు. పిహెచ్‌డీ పట్టా సాధించిన విద్యార్థిని కళాశాల అధ్యాపక బృందం ఈసీఈ విభాగం ప్రొపెసర్ పి. పళినిస్వామి, కళాశాల డీన్ ముత్తారెడ్డి తదితరులు అభినందించారు.

## ఘనంగా లక్ష్మన్‌రెడ్డి షష్టిపూర్తి వేడుకలు



మర్రి లక్ష్మణ్‌రెడ్డి తంపతులకు శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రులు కేటీఆర్, మల్లారెడ్డి తదితరులు మాజీ మంత్రి హరీష్‌రావు తదితరులు

**మేడ్చల్, జూన్ 14, ప్రభాతవార్త :** ఎంఎల్ఆర్ గ్రూప్ విద్యా సంస్థల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి అరుందతీ దంపతుల 60వ వివాహ వార్షికోత్సవ వేడుకలను గుండ్లపోచంపల్లి డివిజన్ పరిధి మునీరాబాద్ గ్రామంలో గల అన్వ కన్వెన్షన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు, మల్లారెడ్డిలు విచ్చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మర్రి రాజశేఖర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేష్, సునితా లక్ష్మారెడ్డి, వివేకానంద, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్యేలు పద్మా దేవేందర్‌రెడ్డి, కూన శ్రీశైలం, నాయకులు, ప్రముఖులు పాల్గొన్నారు.

## కేశంపేట మండల ఉప సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా మహమ్మద్ షకీల్,ఉపాధ్యక్షుడిగా ప్రమోద్ రెడ్డి



**కేశంపేట, జూన్ 14, ప్రభాతవార్త :** మండలం ఉప సర్పంచ్ ల సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం కేశంపేట మండల కేంద్రంలోని షాద్ నగర్ రోడ్డులో గల బిఎస్ వై గార్డెన్ లో మండల పరిధిలోని గ్రామాలకు చెందిన ఉప సర్పంచ్‌లు సమావేశం అయ్యారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ ఉప సర్పంచుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మట్ట శ్రీనివాస్ ముఖ్య అతిది :గా హాజరయ్యారు. సమావేశంలో ఉపసర్పంచ్‌ల సమస్యలు, వారి బాధ్యతలపై పెద్ద ఎత్తున చర్చ చేసి సలహాలు సూచనలు అందించారు. అనంతరం కేశంపేట మండలం ఉప సర్పంచ్‌ల సంఘాన్ని సభ్యులంతా ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. కేశంపేట మండల ఉపసర్పంచ్ ల సంఘం గౌరవ అధ్యక్షురాలిగా లింగం దాన గ్రామానికి చెందిన బండెల లావణ్య తిరుపతి రెడ్డి, అధ్యక్షునిగా సంగెం గ్రామానికి చెందిన మహమ్మద్ షకీల్ , ఉపాధ్య క్షుడిగా లేమామిడి గ్రామానికి చెందిన ప్రమోద్ రెడ్డి, జనరల్ సెక్రటరీగా దేవి రవి నాయక్, జాయింట్ సెక్రటరీగా నరేష్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా రవి నాయక్, దన్ సింగ్, శ్రీను, జ్యోతి నరేందర్ రెడ్డి లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచులు బండ హరీశ్వర్ , బుర్రి భూపాల్ రెడ్డి, దండే రామచంద్రయ్య, జట్టూరి జయమ్మ నాగిరెడ్డి, కాట్రావత్ రాజు నాయక్, హనుమంతు, రాంరెడ్డి, సంధ్య శ్రీకాంత్, రామకృష్ణ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆహ్వానం..

**షాబాద్, జూన్ 14, ప్రభాతవార్త :** వ్యవసాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం 10గంటలకు షాబాద్ రైతు వేదిక యందు కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన ఫర్టిలైజర్ బుకింగ్ అప్‌పై షాబాద్ మండలంలోని అన్ని గ్రామాల రైతులకు, సాయిల్ వాలంటీర్స్ ముగ్గురి చొప్పున వాలంటరీలకు, మండలంలోని సీడ్స్, ఫర్టిలైజర్, పెస్టిసైడ్ డీలర్లకు వ్యవసాయ సహకార సంఘాల స్టాఫ్ కు, ఎఫ్.పి.ఓ సి (ఇ.ఓ. ఓ) మరియు సభ్యులు అవగాహన సదస్సును నిర్వహించడం జరుగుతుంది. కావున ఇట్టి సదస్సుకు అన్ని గ్రామాల రైతు సోదరులు, గౌరవ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి, గౌవర సర్దార్ నగర్ మార్కెట్ చైర్మన్ పీసరి సురేందర్ రెడ్డి , సభ్యులు, గుడిమల్కాపూర్ మార్కెట్ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్ అన్ని గ్రామాల గౌరవ సర్పంచులు ,డిప్యూటీ సర్పంచులు ,వార్డ్ సభ్యులు మరియు మండలంలోని అన్ని గ్రామాల గౌరవ ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పకుండా పాల్గొని సదస్సును విజయవంతం చేయవలసినదిగా కోరారు.

# పోచమ్మ ఆలయ నిర్మాణానికి లక్ష రూపాయల విరాళం

**జన్మనిచ్చిన తల్లిదండ్రులే దేవుళ్లతో సమానం**

**: తొమ్మిది రేకుల సర్పంచ్ బీస కవితా కరుణాకర్ రెడ్డి**

**కేశంపేట, జూన్ 14, ప్రభాతవార్త :**

జన్మనిచ్చిన తల్లిదండ్రులే కనిపించే దేవుళ్ళు అని తొమ్మిది రేకుల గ్రామ సర్పంచ్ బీస కవితా కరుణాకర్ రెడ్డి అన్నారు జన్మనిచ్చిన తల్లి దండ్రులను స్మరించుకుంటూ వారి జ్ఞాపకార్థంగా తొమ్మిది రేకుల గ్రామం లో ఒక సామాజిక వర్గానికి చెందినవారు పోచమ్మ గుడి నిర్మాణానికి ఆర్థిక సహాయం కోరగా వెంటనే స్పందించిన కరుణాకర్ రెడ్డి వారి తండ్రి కీర్తిశేషులు బీస కృష్ణారెడ్డి జ్ఞాపకార్థం 100000 లక్ష రూపాయలను కరుణాకర్ రెడ్డి కుమారుడు బీసా హనితేజ రెడ్డి చేతులు మీదుగా గుడి నిర్మాణానికి అందజేశారు. ఈ సందర్భంగా కవితా కరుణాకర్ రెడ్డి మాట్లా డుతూ గ్రామంలో ఇలాంటి కార్యక్రమాలు చేయడం చాలా సంతోషమని గ్రామ అభివృద్ధిలో తమ సహాయ సహకార ఎల్లప్పుడూ ఉంటాయని అన్నారు. ఎంతో గొప్ప మనసుతో జన్మనిచ్చిన తల్లిదండ్రుల పేరుపై అడిగిన వెంటనే గుడి నిర్మాణానికి సహకరించిన సర్పంచ్ కుటుంబ సభ్యు లకు గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పోగుల భీమయ్య ,మాజీ ఉపసర్పంచ్ లు నరసింహారెడ్డి, పోగుల నర్సింహులు,కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంకటరెడ్డి,



గుడి నిర్మాణానికి ఆర్థిక సాయం చేస్తున్న సర్పంచ్ బీస కవితా కరుణాకర్ రెడ్డి

వార్డ్ మెంబర్స్ గుత్తి చంద్రయ్య, పోగుల నర్సింలు ,నాగిళ్ల ప్రేమలత యాదయ్య ,నాయకులు గుత్తి శేఖర్ ,నిరంజన్ ,కందన కృష్ణ ,బిక్షపతి, రాజారాం, పబ్బతి మల్లయ్య ,నర్సింలు, రాములు, ధర్మయ్య, చెన్నయ్య ,గణేష మల్లయ్య ,నారాయణ,జంగయ్య గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ స్కూల్స్ పుస్తకాల దందాపై చర్యలు తీసుకోవాలి

**షాద్‌నగర్, జూన్ 14, ప్రభాతవార్త :** ప్రైవేట్ పాఠశాలల్లో కొనసాగుతున్న పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంలు, బ్యాగులు, షూస్ విక్రయాల దందాపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ షాద్‌నగర్ డివిజన్ కార్యదర్శి వడ్ల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రైవేట్ స్కూల్స్‌లో విద్యార్థుల తల్లిదండ్రులను బలవంతంగా స్కూల్ యాజమాన్యం సూచించిన షాపుల నుంచే పుస్తకాలు, స్టేషనరీ సామగ్రి కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. మార్కెట్‌లో లభించే పుస్తకాల కంటే 30 నుంచి 60 శాతం వరకు అధిక ధరలకు విక్రయిస్తూ తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నారని పేర్కొన్నారు. అదే విధంగా కొన్ని పాఠశాలలు తమ లోగోతో పుస్తకాలు ముద్రించి అధిక ధరలకు విక్రయిస్తున్నాయని, పాత పుస్తకాలను కూడా కొత్తవిగా చూపించి అమ్ముతున్న సందర్భాలు ఉన్నాయని తెలిపారు. ఒక్కో విద్యార్థిపై సంవత్సరానికి రూ.8,000 నుంచి రూ.15,000 వరకు పుస్తకాలు, నోట్‌బుక్స్, స్టేషనరీ పేరుతో అదనపు భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పర్మిషన్ లేని ప్రైవేట్ పాఠశాలలపై కూడా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. రేపటి నుంచి అన్ని ప్రైవేట్ స్కూల్స్‌లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి అక్రమ వసూళ్లు, పుస్తకాల దందాను అరికట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలలు విద్యను అందించే కేంద్రాలుగా ఉండాలే గానీ వ్యాపార సంస్థలుగా మారకూడదని, విద్యను లాభార్జన సాధనంగా మార్చడం సమాజానికి హానికరమని అన్నారు. తల్లిదండ్రులు కూడా మేల్కొని తమ హక్కుల కోసం ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

## పోచమ్మ ఆలయానికి రూ.1.16 లక్షల విరాళం

**షాద్‌నగర్, జూన్ 14, ప్రభాతవార్త :** ఫరూఖ్‌నగర్ మండలం వెలిజర్ల గ్రామంలో నిర్మాణంలో ఉన్న పోచమ్మ దేవాలయానికి గ్రామానికి చెందిన ఎస్బిఐ మేనేజర్ జాంగారి నర్సింహ్మా, అనురాధ దంపతులు రూ.1,16,116 (ఒక లక్ష పదహారు వేల నూట పదహారు రూపాయలు) విరాళంగా అందజేశారు. ఈ విరాళాన్ని పోచమ్మ ఆలయ కమిటీ చైర్మన్ కావలి నర్సింహులు మరియు కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా జాంగారి నర్సింహ్మా మాట్లాడుతూ, తమ సొంత గ్రామంలో నిర్మితమవుతున్న పోచమ్మ ఆలయానికి తన వంతు సహాయం చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. గ్రామ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు అండగా నిలుస్తూ ఆలయ నిర్మాణానికి సహకరించడం తమ బాధ్యతగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు జాంగారి నర్సింహ్మా అనురాధ దంపతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పోచమ్మ తల్లి ఆశీస్సులతో వారు మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షి ంచారు. గ్రామాభివృద్ధి, ధార్మిక కార్యక్రమాలకు ఎల్లప్పుడూ ముందుండే వారి సేవలను కొనియాడారు. అలాగే ఈ విరాళం అందించేందుకు కృషి చేసిన వెలిజర్ల గ్రామానికి చెందిన జీపీవో కావలి జగన్‌కు గ్రామస్థులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ఘనంగా బొడ్రాయి ఉత్సవాలు..



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కౌన్సిలర్ శిరీష అనిల్ కుమార్

**షాద్‌నగర్, జూన్ 14, ప్రభాతవార్త :** షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని సోలిపూర్ గ్రామంలో బొడ్రాయి ఉత్సవాలు భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని బొడ్రాయికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదవ వార్డు కౌన్సిలర్ సింగపాగ శిరీష అనిల్ కుమార్ దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామం పాడిపంటలతో, పశుపక్ష్యాదులతో సుభిక్షంగా వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. గ్రామానికి ఎలాంటి జీడపీడలు, అనర్థాలు దాపురించకుండా అమ్మవారు కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరావు పంతులు, పూజారులు సునీల్ పంతులు, శివరాములు యాదవ్, పి. వెంకటేష్ గౌడ్, ఆంజనేయులు గౌడ్, సింగపాగ జంగయ్య, గడ్డం కృష్ణయ్య, కావలి కృష్ణయ్య, పిచ్చుకుంట్ల శేఖర్, చీపిరి బాల్‌రాజ్, సతీష్, చీపిరి వెంకటేష్, యాదయ్య, బాబు నాయక్, చెన్నయ్య, మాజీ వార్డు సభ్యులు సింగపాగ లక్ష్మయ్యతో పాటు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్ది పెంటయ్య

## రూ.25కోట్లతో మున్నూర్ కాపు భవన నిర్మాణం

**కొడంగల్,జూన్ 14,ప్రభాతవార్త:** హైద్రాబాద్‌లోని కోకాపేట్‌లో రూ.25కోట్లతో మూన్నూర్ కాపు భవనాన్ని నిర్మిస్తున్నట్లు మున్నూర్ కాపు సంఘం రాష్ట్ర ప్రదాన కార్యదర్శి పెద్ది పెంటయ్య తెలిపారు.ఆదివారం కొడంగల్‌లో సంఘం అద్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.సిఎం రేవంత్‌రెడ్డి తెలంగాణా రాష్ట్ర మున్నూర్ కాపు కార్పోరేషన్‌ను ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు.కార్పోరేషన్ ద్వారా మున్నూర్ కాపులకు సంఘం సామాజికంగా,ఆర్దికంగా ఉండగా ఉంటూ ఆదుకుంటామని తెలిపారు .హైద్రాబాద్‌లోని కోకాపేట్‌లో మున్నూర్ కాపు సంఘానికి ఐదు టవర్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు.మొదటి విడతలో రూ.25కోట్లతో మొదటి టవర్ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు.దశల వారిగా మరో రూ.100కోట్లతో నాలుగు టవర్ల నిర్మాణం చేయడానికి కృషి చేస్తున్నట్లు వివరించారు.ఈనెల 17న హైద్రాబాద్‌లోని రవీంద్రభారతిలో మున్నూర్ కాపు కార్పోరేషన్ చైర్మేన్ బొమ్మ శ్రీరాంచక్రవర్తి,బిసి సంక్షేమ శాఖ సలహాదారులు హన్మంత్‌రావు,మహిళా కమీషన్ చైర్మేన్ గద్వాల విజయలక్ష్మీలను సన్మానిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి వికారాబాద్ జిల్లా నలుమూలలను నుంచి మున్నూర్ కాపు తరలిరావాలని పిలుపు నిచ్చారు.మున్నూర్ కాపు రాష్ట్ర మహాసభ ద్వారా విద్యార్థులకు కాచిగూడలో హస్టల్ వసతి కల్పిస్తున్నట్లు చెప్పారు.మెరిట్ స్కాలర్‌షిప్‌లు ,ఉపకార వేతనాలు అందిస్తున్నట్లు చెప్పారు.పేదింటిలో పెళ్ళి ఉంటే పుస్తె మెట్టేలు అందిస్తున్నట్లు తెలిపారు.అనంతరం జరిగిన సంఘం కార్యవర్గ సమావేశంలో కొడంగల్ నియోజకవర్గం నుండ ఇ కాచిగూడ మహాసభకు రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా కొడంగల్‌కు చెందిన బాకారం చంద్రశేఖర్‌ను ,మున్నూర్ కాపు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా మున్నూర్ బిచ్చప్ప లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.కార్యక్రమంలో సంఘం నాయకులు బాకారం చంద్రశేఖర్,శేఖర్‌రెడ్డి,బిచ్చప్ప,శ్యాంసుందర్, వెంకటయ్య,వీరేశం, మాసన్న,శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఓఆర్ఆర్‌పై జరిగిన రోడ్డు ప్రమాదం వివరాలు సేకరిస్తున్న ఎస్ నాగరాజు

## ఓఆర్ఆర్‌పై రోడ్డు ప్రమాదం ఒకరు మృతి

**కీసర,జూన్14,ప్రభాతవార్త:**

ఓఆర్ఆర్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు కీసర సిఐ అర్కపల్లి ఆంజనేయులు తెలిపారు.వివరాల్లోకి వెళితే ఓఆర్ఆర్‌పై ఆగి ఉన్న ట్రక్కును హనుమకొండ జిల్లా పరకాలకు చెందిన పిట్టల కిరణ్ (30),మణితేజ్ స్నేహితులు కాగా బిఎన్‌రెడ్డినగర్‌లో ఒక ఫంక్షన్‌కి వెళ్లి తిరిగి తాము నివసిస్తున్న గ్రామం బాచుపల్లికి తిరిగి అంబర్‌పేట్ వద్ద రింగు రోడ్డు ఎక్కి బాచుపల్లికి ఓఆర్ఆర్‌పై ప్రయాణిస్తున్నారు.బాచుపల్లిలో ఉంటే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు.కాగా రాంపల్లిదాయర దగ్గరకు రాగానే ఇన్నోవా కారు వేగంగా ఉండటంతో అదుపు తప్పి పార్కు చేసిన ట్రక్కును వెనకాల నుండి అతివేగంగా ఢీ కొట్టింది.కారు నడుపుతున్న కిరణ్ అక్కడికక్కడే మృతి చెందాడు.స్నేహితుడు మణితేజ్‌కి తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.ఈ కేసును కీసర పోలీసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



కీసర పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న మృతుని బంధువులు

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

**కీసర,జూన్14,ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి చెందిన సంఘటన కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది.సిఐ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం నగరంలోని కుషాయి గూడలో పూల వ్యాపారం చేసుకుంటూ జీవనోపాది పొందుతున్న రాజు (30) కీసర సర్కిల్ పరిధిలో నివసిస్తున్నాడు.కాగా ఈ నెల 8వ తేదీన కీసర రహదారిలో తన ద్విచక్ర వాహనం కారను ఢీ కొట్టింది.దీంతో తీవ్ర గాయాలైన అతనిని చికిత్స నిమిత్తం నగరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు.కాగా అతని పరిస్థితి విషమించి ఆదివారం ఉదయం ఆసుపత్రిలోనే మృతి చెందాడు.తమకు న్యాయం చేయాలని కోరుతూ మృతి చెందిన బంధువులు మృతదేహంతో పెద్ద ఎత్తున పోలీస్‌స్టేషన్‌కి వచ్చి పోలీసులు డౌన్ డౌన్ అంటూ నిరసన వ్యక్తం చేశారు.సిఐ ఆంజనేయులు సర్ది చెప్పి న్యాయం జరిగేలా చూస్తానిని చెప్పడంతో వాళ్లు తిరిగి వెళ్లారు.ఈ కేసును కీసర పోలీసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## బిఎల్‌ఓల సర్వేకు సహకారం అందించాలి

**సిపిఐ రాష్ట్రష కౌన్సిల్ సభ్యులు ఇందనూర్ బషీర్**

**కొడంగల్,జూన్ 14,ప్రభాతవార్త:**

గ్రామాల్లో సర్వే నిర్వహించే బిఎల్‌ఓలకు సంపూర్ణ సహకారం అందిం చాలని సిపిఐ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఇందనూర్ బషీర్ అన్నారు. ఆదివారం సిపిఐ కొడంగల్ నియోజకవర్గ సమావేశం పార్టీ కార్యాలయం నిర్వహించారు.పార్టీ తరపున బిఎల్‌ఎ నియామక సమావేశం ఎండి.మహమూద్ అద్యక్షతన నిర్వహించగా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఇందనూర్ ముఖ్య అతిధిగా హజరైయ్యారు.ఈ కార్యక్రమంలో దౌల్తాబాద్, కొడంగల్,బొంరాస్‌పేట్,దుద్యాల,కోస్గీ మండలాల కార్యదర్శులు పాల్గొ న్నారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సర్వే నిర్వహించే బిఎల్‌ఓలకు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శులు శ్యాంసుందర్,మల్లప్ప,ఎండీ,రహీం,నీటూర్ మాజీ సర్పంచ్ వెంకటప్ప,కోస్గీ శ్రీనివాస్,మోహన్‌సింగ్,శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బషీర్



## ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం

**తలకొండపల్లి, జూన్ 14, ప్రభాతవార్త:**

తలకొండపల్లి మండల పరిధిలోని లింగ రావు పల్లి గ్రామానికి చెందిన రాజమోళి ఆంజనేయులు అనే వ్యక్తికి ఆదివారం నాడు గ్రామ సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి ఇంటి నిర్మాణం కోసం సిమెంటు ఉచితంగా అంద జేశారు. పేదవాడైన ఆంజనేయులు తమ ఇంటి నిర్మాణానికి ఆర్థిక స్థోమత లేకపోవడంతో నిలుపుదల చేశారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి అతను ఇంటికి అవసరమగు సిమెంటును ఉచితంగా అందజేసి ఆదుకోవడంతో లబ్ధిదారులు సర్పంచ్‌కి కృతజ్ఞతలు తెలిపారు.

## నేడు విద్యా కమిషన్ సభ్యుడు రాక

**తలకొండపల్లి, జూన్ 14, ప్రభాతవార్త:**

తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్ గ్రామానికి రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యుడు చారకొండ వెంకటేష్ నేడు రానున్నారు. రాష్ట్రంలో రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల పున ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ఇటీవల వెల్జాల్ గ్రామంలోని ప్రభు త్వ పాఠశాలను రాష్ట్రప్రభుత్వం పబ్లిక్‌స్కూల్‌గా మార్చనున్నారు. సోమారం ఉదయం 8.30 గంటలకు ప్రభుత్వ పాఠశాలకు ఆయన రానున్నారు.

## త్రాగునీటి సమస్య తీర్చిన సర్పంచ్

**తలకొండపల్లి, జూన్ 14, ప్రభాతవార్త:**

తలకొండపల్లి మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో ఉన్న నీటి సమస్యను గ్రామ సర్పంచ్ వట్టెల నిర్మల శ్రీశైలం యాదవ్. తీర్చారు. గ్రామంలో గత కొంతకాలంగా మిషన్ భగీరథ నీటి కొరత ఏర్పడడంతో గ్రామస్తులకు తాగునీటి ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో సర్పంచ్ బట్టల నిర్మల శ్రీశైలం యాదవులు చొరవ తీసుకొని రిపేర్ గురైన బోర్ మోటార్ ను తొలగించి నూతనంగా బోరు మోటర్ ను బిగింప చేశారు. గత వారం రోజులుగా ఈదురుగాలులు వర్షానికి విద్యుత్ సరిగా లేకపోవడంతో ఇబ్బందులకు గురికావడంతో సర్పంచ్ చొరవ తీసుకొని ట్రాన్స్ఫార్మర్ మరమ్మతులు చేయించి నూతన బోర్ మోటర్ ద్వారా తాగునీటి సమస్యను తీర్చారు. దీంతో గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొట్టెల నిర్మల శ్రీశైలం యాదవ్ ఉప సర్పంచ్ ఆంజనేయులు శేఖర్ యువ నాయకులు నరసింహ గౌడ్ రొయ్యల మహేష్ తిక్కల మల్లేష్ , రాజు విక్రమ్ అధికారులు తదితరులు ఉన్నారు.

## మిత్రుని వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

**తలకొండపల్లి, జూన్ 14, ప్రభాతవార్త:**

తలకొండపల్లి మండల పరిధిలోని చంద్రధన గ్రామానికి చెందిన వడ్డే నరసింహ గత కొంతకాలంగా అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న తమ పదవ తరగతి మిత్రులు ఈ విషయం తెలుసుకున్న తమ తోటి పదవ తరగతి మిత్రులు హైదరాబాదులో చికిత్స పొందుతున్న వడ్డే నరసింహ వద్దకు వెళ్లి పరా మర్శించారు. అనంతరం అతని వైద్య ఖర్చుల నిమిత్తం 16 వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. తమ మిత్రుడు త్వరగా కోలుకోవాలని పూర్తి ఆరోగ్యంతో తిరిగి రావాలని సందర్భంగా వారు వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో నరసింహ పదవ తరగతి మిత్రులు ఉన్నారు.

## శ్రీనివాస నగర్ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తా

**కీసర,జూన్14,ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని నాగారం డివిజన్ పరిధిలోని శ్రీనివాస నగర్ కాలనీ అభివద్దికి తనవంతు కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కౌకుట్ల జీవన్‌రెడ్డి అన్నారు.ఆదివారం శ్రీనివాస నగర్ కాలనీ నూతన కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే కాలనీల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు.కాలనీ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు.కాలనీ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి ముదుంటానని సూచించారు.అనంతరం ముఖ్య అతిధిగా విచ్చేసిన జీవన్‌రెడ్డిని కాలనీవాసులు ఘనంగా సన్మానించారు. నూతనంగాఎన్నికైన కాలనీ అధ్యక్షుడికి,కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసి పదవీ కాలం విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు మల్లారెడ్డి,ఆల్ కాలనీ అద్యక్షులు వేణుగోపాల్,ఉపాధ్యక్షులు ప్రసాద్‌రావు,కాంగ్రెస్ నాయకులు పంబాల రమేష్,మహిపాల్‌రెడ్డి,బాల్‌రాజు యాదవ్,ప్రకాష్, సోమిరెడ్డి, కుమార్, మాదిరెడ్డి సుధాకర్‌రెడ్డి,వంశీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని అరికట్టాలి

**చేవెళ్ల, జూన్ 14, ప్రభాతవార్త :** ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అధిక ఫీజులు వసూలు చేయడంతో పాటు పుస్తకాలు, యూనిఫాంలు, స్టేషనరీ వస్తువులను బలవంతంగా విక్రయిస్తూ తల్లిదండ్రులను ఆర్థికంగా దోపిడీ చేస్తున్నాయని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్ ఆరోపించారు. చేవెళ్ల మున్సిపాలిటీ కేంద్రంలో అంబేద్కర్ భవన్లో ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ ముఖ్య కార్యకర్త సమావేశాన్ని నిర్వహించారు .ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యను వ్యాపారంగా మార్చి ఇష్టానుసారంగా ఫీజులు పెంచడం బాధాకరమన్నారు. విద్యార్థులు పాఠశాలల వద్ద నుంచే పుస్తకాలు, యూనిఫాంలు కొనుగోలు చేయాలని ఒత్తిడి తేవడం నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు.ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి అధిక ఫీజులు వసూలు చేస్తున్న, పుస్తకాలు-యూనిఫాంల విక్రయాలను బలవంతం చేస్తున్న పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ప్రైవేట్ పాఠశాలల దోపిడీకి అడ్డుకట్ట వేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ సహాయ కార్యదర్శి చరణ్ గౌడ్, మాల చందు, డివిజన్ ఉపాధ్యక్షులు మణికంఠ, డివిజన్ నాయకులు వినోద్, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

## రాజస్థాని మహిళ మండలి ఆధ్వర్యంలో రక్తదానం



రక్తదానం చేస్తున్న మహిళలు

**తాండూరు, జూన్ 14, ప్రభాతవార్త :** ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని రాజస్థానీ మహిళ మండలి ఆద్వర్యంలో రక్తదాన శిభిరం ఏర్పాటు చేశారు. ఆదివారం రాజస్థానీ మహిళ మండలి ఆద్వర్యంలో స్థానిక ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలోని రక్త నిధి కేంద్రంలో 12మంది మహిళా మండలి సభ్యులు రక్తదానం చేశారు.

సమాజ సేవలో మేము సైతం అంటూ మహిళా మండలి సభ్యులు రక్తదానం చేయడం గొప్ప విషయమని పలువురు సమాజం పెద్దలు అభినందించారు.ఈ కార్యక్రమంలో మహిళా మండలి అధ్యక్షురాలు కిరణ్ సార్డా, కార్యదర్శి వర్షా సార్డా, సభ్యులు రీతూ సోనీ, సీమా సార్డా, నిఖిత బూబ్, దీపా బూబ్, మంచ్ సభ్యులు మన్మోహన్ సార్డా, కరణ్ జైన్, భరత్ దేవ్డా, రమాకాంత్ పండిత్, అనిల్ సార్డా, దినేష్ పరధానీ, అభిషేక్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.